విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 298 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శనివారం 21 మార్చి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## పిరికి పందల్లారా.. అమెరికా లేకుంటే మీరు కాగితపు పులులు

## నాటో దేశాలపై ట్రంప్ ఫైర్

వాషింగ్టన్: ఇరాన్‌పై యుద్ధంలో అమెరికాకు మద్దతు ఇవ్వని నాటో దేశాలపై ట్రంప్ విరుచుకుపడ్డారు. నాటో దేశ అధినేతలు పిరికి పందలని విమర్శించారు. అమెరికా మద్దతు లేకుంటే నాటో కూటమి ఒక కాగితపు పులి అని ఎద్దేవా చేశారు. అణుశక్తిగల ఇరాన్‌ను అడ్డుకోవడానికి జరుగుతున్న పోరాటంలో చేరడానికి సభ్య దేశాలు నిరాకరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటో దేశాలు మద్దతు ఇవ్వకున్న ఇరాన్ యుద్ధంలో అమెరికా సైనిక విజయం సాధించిందని పేర్కొన్నారు. అధిక చమురు ధరలపై ఫిర్యాదు చేస్తోన్న నాటో కూటమి దేశాలు అందుకు కారణమైన హార్ముజ్ జల సంధికి విముక్తి కల్పించడం కోసం ఒక సైనిక ఆపరేషన్ చేపట్టడానికి మాత్రం ఇష్టపడటం లేదని అసహనం వ్యక్తం చేశారు. హార్ముజ్ జల సంధికి విముక్తి కల్పించడంలో తోడ్పాటు అందించడం వాళ్లకు సులభం. ప్రమాదం కూడా తక్కువే. కానీ వాళ్లు పిరికి వాళ్లు. మేం అన్ని విషయాలు

- మిగతా 2లో

# తిరుమల అభివృద్ధిపై సీఎం చంద్రబాబు సమీక్ష


టీటీడీ అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

మనవడు దేవాన్ష్ పుట్టినరోజు వేడుకల కోసం తిరుమలకు సీఎం

భక్తుల సౌకర్యాలు, వేసవి రద్దీపై అధికారులతో చర్చ

శ్రీవారి అన్నప్రసాదం కోసం కుటుంబం తరపున రూ. 44 లక్షల విరాళం

ప్రసాదాల నాణ్యత కోసం కొత్త ఫుడ్ ల్యాబ్‌ను ప్రారంభించనున్న సీఎం



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమల పర్యటనలో భాగంగా టీటీడీ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నిన్న తిరుమలలోని గాయత్రీ నిలయం అతిథి గృహంలో ఈ సమావేశం జరిగింది. దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ భేటీలో తిరుమల అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై ఆయన ప్రధానంగా దృష్టి సారించారు. వేసవిలో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా చేయాల్సిన ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తిరుమలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, దర్శన ఏర్పాట్లు, పర్యావరణ పరిరక్షణ చర్యలపై ఆరా తీశారు. ఈ సమావేశంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి తన మనవడు నారా దేవాన్ష్ పుట్టినరోజు (మార్చి 21) సందర్భంగా కుటుంబ సమేతంగా నిన్న తిరుమలకు విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు తమ కుటుంబం తరపున ఒక రోజు అన్నదానానికి అయ్యే ఖర్చు కింద రూ. 44 లక్షల విరాళాన్ని అందజేశారు. కాగా, ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్న అనంతరం, చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలో భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించనున్నారు. అనంతరం, తిరుమలలో సుమారు రూ. 20–25 కోట్ల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీని ఆయన ప్రారంభించనున్నారు. ఈ ల్యాబ్‌లో శ్రీవారి లడ్డూ, ఇతర ప్రసాదాల నాణ్యతను శాస్త్రీయంగా పరీక్షించనున్నారు.



## షర్మిల పిల్లలకు జగన్ అన్యాయం

- వైఎస్ చనిపోయేనాటికి ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే
- మనవలు నలుగురికీ సమానంగా పంచాలన్నది రాజశేఖరరెడ్డి ఆదేశం
- షర్మిలకు ఇచ్చింది వాటా కాదు.. డివిడెండ్ మాత్రమే
- ఆస్తుల పంపకం జరగలేదు
- అసత్య ప్రచారాలొద్దు
- వైఎస్ విజయమ్మ ప్రకటన

వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించే నాటికి ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులేనని.. ఇవన్నీ మనవలు, మనవరాళ్లు (కుమారుడు జగన్, కుమార్తె షర్మిల సంతానం) నలుగురికీ సమానంగా పంచాలన్నది ఆయన ఆశయం, ఆదేశం కూడా అని వైఎస్ సతీమణి విజయమ్మ ప్రకటించారు. షర్మిల పిల్లలకు జగన్ అన్యాయం చేశారని అన్నారు. మేనల్లుడు, మేనకోడలికి జగన్ ఎప్పటికైనా న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నానని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇళ్లు, రూ. 230 కోట్ల నగదు, ఇతర ఆస్తులు ఇచ్చినా జగన్ కష్టార్జితంలో షర్మిల వాటా అడుగుతున్నారంటూ వైకాపా నేతలు

- మిగతా 2లో



## ప్రీమియం పెట్రోల్ ధర రూ.2 పెంపు

### పారిశ్రామిక డీజిల్ ధర రూ.22 పెరుగుదల

### మారని సాధారణ పెట్రోలియం, డీజిల్ ధరలు

ఢిల్లీ: పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో భారత్‌లో ప్రీమియం పెట్రోల్ ధర లీటర్‌కు రూ.2 చొప్పున పెరిగింది. పారిశ్రామిక అవసరాలకై వినియోగించే డీజిల్ ధరను లీటరుపై రూ.22 మేరకు పెంచారు. అయితే సాధారణ శ్రేణి పెట్రోలు, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. దీంతో ప్రీమియం 95 ఆక్టేన్ పెట్రోల్ ధర రూ.99.89 నుంచి రూ.101.89కు, పారిశ్రామిక డీజిల్ ధర రూ.87.67 నుంచి రూ.109.59కి పెరిగాయని పరిశ్రమ

- మిగతా 2లో

## త్వరలో శ్రీకాకుళం నుంచి తిరుపతి, హైదరాబాద్‌కు రైళ్లు

### కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడి



త్వరలో శ్రీకాకుళం నుంచి నేరుగా తిరుపతి, హైదరాబాద్‌లకు రైళ్లు నడిచేలా కృషి చేస్తానని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ప్రస్తుతం అందుకు అవసరమైన సర్వే

- మిగతా 2లో



## ఇక భూతల దాడులు!

- హోర్ముజ్ విముక్తికి సిద్ధమైన అమెరికా
- ఇరాన్ తీర ప్రాంతాలు, దీవుల స్వాధీనానికి ప్రణాళిక
- పశ్చిమాసియావైపు ట్రిపోలి, బాక్సర్ యుద్ధ నౌకలు
- నౌకల నుంచి తీరానికి చేరుకుని దాడి చేసే 'యాంఫిబియస్ రెడీ గ్రూపు' బలగాల తరలింపు
- తక్కువ ఎత్తులో ప్రయాణించే హ్యారియర్, ఏ-10 విమానాలు, అపాచీ హెలికాప్టర్లు కూడా..
- కీలకమైన ఖార్గ్ దీవి స్వాధీనం దిశగా అడుగులు
- ఇరాక్ నుంచీ బలగాలను తరలిస్తున్న అగ్రరాజ్యం
- హోర్ముజ్ భద్రత కోసం వస్తామన్న ఆరు దేశాలు
- సైనికపరంగా జోక్యం చేసుకోవడంపై అస్పష్టత
- రష్యా చమురుపై మరోసారి ఆంక్షల సడలింపు
- కొత్త సాధారణ లైసెన్స్ జారీ చేసిన అమెరికా
- ఇరాన్ చమురుపైనా ఆంక్షలు ఎత్తేసే యోచన

మిగతా 2లో

## 20 నెలల్లో 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించాం

### వాటిలో 30,607 ప్రభుత్వ కొలువులు

### మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడి



అమరావతి: రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఇప్పటి వరకూ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కలిపి రికార్డు స్థాయిలో 6,28,347 ఉద్యోగాలు కల్పించిందని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఇందులో 30,607 ప్రభుత్వ ఉద్యోగాలున్నాయని వివరించారు. తాజాగా ఇచ్చిన జాబ్ క్యాలెండర్‌తో మరో 10,060 ఉద్యోగాలు వస్తాయన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఎంఎస్ఎంఈల ద్వారా 2.5 లక్షల మందికి, జాబ్‌మేళాలు, నైపుణ్య శిక్షణ ద్వారా 1,46,620 మందికి, ఐటీ, పర్యాటక రంగాల్లో లక్ష మందికి ఉద్యోగాలు లభించాయి. యువగళం పాదయాత్రలో

- మిగతా 2లో

## వంట పద్ధతులు మార్చుకోవాలి

- మన్యం, గ్రామాల్లో రేషన్ కార్డుకు లీటరు కిరోసిన్
- రాబోయే రోజుల్లో సంక్షోభం మరింత తీవ్రం.. త్యాగాలకు సిద్ధంగా ఉండాలి
- పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

పుష్కరకాలం క్రితమే కిరోసిన్ రహిత రాష్ట్రంగా మారిన ఆంధ్రప్రదేశ్‌కి... ఇప్పుడు మళ్లీ కిరోసిన్ అవసరమొచ్చింది. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలు, గ్రామాల్లో కార్డుకు లీటరు చొప్పున కిరోసిన్ వచ్చేవారంలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రాష్ట్రానికి కేంద్రం 2,800 కిలోలీటర్ల

- మిగతా 2లో



## ఐఆర్‌జీసీ కీలక కమాండర్ మృతి

ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కమాండర్, అధికార ప్రతినిధి అలీ మొహమ్మద్ నయీని, బసిజ్ మిలీషియా ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ హెడ్ ఇస్మాయిల్ అహ్మది శుక్రవారం ఇజ్రాయెల్ దాడుల్లో మృతిచెందారు. ఇరాన్ క్షిపణి పరిశ్రమకు నష్టమేమీ జరగలేదని, క్షిపణుల ఉత్పత్తి కొనసాగుతోందని.. షాక్ కలిగించే స్థాయిలో దాడులు చేస్తామని మొహమ్మద్ నయీని గురువారమే

- మిగతా 2లో



# ఇక భూతల దాడులు!

ఇరాన్‌పై యుద్ధం ఎటూ తేలని స్థితి, చమురు ధరల పెరుగుదల, గ్యాస్ కొరతతో ప్రపంచ దేశాలు అల్లాడుతుండటంతో.. హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు అమెరికా తీవ్రస్థాయి యుద్ధానికి సన్నద్ధమవుతోంది. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలోని ఇరాన్ తీర ప్రాంతాన్ని, దీవులను తమ ఆధీనంలోకి తెచ్చుకునే దిశగా వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది. వైమానిక దళం, నేవీతోపాటు ఆర్మీతో ముప్పేట దాడులకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం పశ్చిమాసియా ప్రాంతానికి భారీ స్థాయిలో బలగాలను తరలిస్తోంది. ఇప్పటికే జపాన్‌లోని ఒకినావా స్థావరం నుంచి యూఎస్ఎస్ ట్రిపోలీ యుద్ధ నౌక పశ్చిమాసియాకు బయలుదేరింది. నౌక నుంచి బయటికి వచ్చాక నీటిపై ప్రయాణించి, తీరానికి చేరుకున్నాక భూమిపై ప్రయాణిస్తూ దాడులు చేసే 'యాంఫిబియస్ వాహనాల'తో కూడిన యాంఫిబియస్ రెడీ గ్రూప్ ఆ నౌకలో ఉంది. నౌకలో 2వేల మంది యాంఫిబియస్ సిబ్బందితోపాటు మరో 2,200 మంది మెరైన్ బలగాలు కూడా ఉన్నాయి. ఈ నౌకలపై ఉండే ఎఫ్-35బి, ఏ-10 వార్ట్‌హాగ్స్, హ్యారియర్, సైనికులను, ఆయుధాలను తరలించే ఎంవీ-22 ఓస్ప్రే ఎయిర్‌క్ష?ఫ్టులు, అపాచీ హెలికాప్టర్లతో పదాతి దళాలకు అవసరమైన సహాయం అందుతుంది. శాన్‌డియాగో నుంచి యూఎస్ఎస్ బాక్సర్ యాంఫిబియస్ అసాల్ట్ షిప్ కూడా 2,200మంది సైనికులతో పశ్చిమాసియా వైపు బయలుదేరినట్టు అమెరికా రక్షణ వర్గాలు వెల్లడించాయి.

**తీర ప్రాంతాన్ని స్వాధీనం చేసుకునేలా..**

హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఇరాన్‌కు కీలకమైన ఖెష్మ్ దీవితోపాటు హోర్ముజ్, హెంగమ్, లారక్ ద్వీపాలు ఉన్నాయి. దానికితోడు వందల కిలోమీటర్ల పొడవైన తీర ప్రాంతం జలసంధిలో ప్రయాణించే నౌకలకు అత్యంత సమీపంలో ఉంటుంది. ప్రస్తుతం ఈ దీవులు, తీర ప్రాంతాల నుంచే నౌకలపై ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ క్రమంలోనే ఆ దీవులను, తీర ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్టు రక్షణ వర్గాలు చెబుతున్నాయి. యాంఫిబియస్ నౌకల నుంచి తీర ప్రాంతానికి బలగాలను పంపడం, సైనిక రవాణా హెలికాప్టర్ల ద్వారా కీలక ప్రాంతాలకు సైనికులను చేరవేసి దాడులకు దిగేందుకు రంగం సిద్ధమవుతోందని అంటున్నాయి. పదాతి దళాలకు సాయంగా ఏ-10 వార్ట్‌హాగ్స్, హ్యారియర్ విమానాలు దాడులు చేస్తాయని.. నౌకల నుంచి కూడా సాయం అందుతుందని వివరిస్తున్నాయి.

**ఖార్గ్ ద్వీపాన్ని ఆక్రమించే వ్యూహం**

ఇరాన్‌కు ఆయువుపట్టు అయిన ఖార్గ్ దీవిని స్వాధీనం చేసుకునే దిశగా ట్రంప్ యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు రక్షణ శాఖ ఉన్నతాధికారులను ఉటంకిస్తూ రాయిటర్స్ కథనం ప్రచురించింది. ఇరాన్ చేసే చమురు ఎగుమతుల్లో 90శాతానికిపైగా ఈ ద్వీపం మీదుగానే జరుగుతుంది. దీనిని స్వాధీనం చేసుకుంటే.. ఇరాన్ ఆర్థిక మూలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని అమెరికా భావిస్తున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే ఖార్గ్ దీవిలోని ఇరాన్ సైనిక స్థావరాలు, వ్యవస్థలను అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ విమానాలతో ధ్వంసం చేశాయి.

**ఇరాక్ నుంచి బలగాల తరలింపు!**

కొన్నేళ్లుగా ఇరాక్‌లో ఉన్న నాటో బలగాలను అక్కడి నుంచి తరలిస్తున్నారు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బలగాలు వెనక్కి వెళ్లిపోతున్నాయని, పరిస్థితులు చక్కబడగానే తిరిగి వస్తాయని ఇరాక్ జాతీయ భద్రత విభాగం ప్రతినిధి సయీద్ అల్ జయషి వెల్లడించారు. ఇరాక్‌లో ఉన్న నాటో బలగాల్లో చాలా వరకు అమెరికా సైనికులేనని, ఖార్గ్ దీవి ఆక్రమణ దిశగా వారిని వినియోగించుకోవచ్చని విశ్లేషణలు వెలువడుతున్నాయి.

**హోర్ముజ్ భద్రత కోసం వస్తాం**

ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభ పరిస్థితి తలెత్తుతుండటంతో.. హోర్ముజ్ జలసంధిలో నౌకా రవాణా భద్రంగా సాగే చర్యల్లో పాల్గొనేందుకు సిద్ధమని ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ, ఇటలీ, కెనడా, జపాన్ తదితర దేశాలు వెల్లడించాయి. ఈ మేరకు శుక్రవారం సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. అయితే ఏ తరహా సాయం చేస్తాయన్నదానిపై మాత్రం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. పశ్చిమాసియాకు యుద్ధ నౌకలు పంపడానికి, సైనిక పరంగా జోక్యం చేసుకోవడానికి ఆ దేశాలు ఇప్పటికే నిరాకరించడం గమనార్హం.

# వంట పద్ధతులు మార్చుకోవాలి

-మొదటిపేజీ తరువాయి

కిరోసిన్ కేటాయించిందని, దీనిపై త్వరలోనే మార్గదర్శకాలు జారీచేస్తామని ఆయన వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రోజుకు 2,96,803 సిలిండర్లు బుక్ చేస్తుండగా.. 2,72,449 సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. వంటగ్యాస్ సరఫరాపై శుక్రవారం ఆయన విజయవాడలోని పౌరసరఫరాలశాఖ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 'ప్రస్తుతానికి వంటగ్యాస్ కొరత లేకున్నా.. ఖతార్‌పై దాడి నేపథ్యంలో రాబోయే రోజుల్లో సంక్షోభం ఎదుర్కొనేందుకు, త్యాగాలకు ప్రజలు సిద్ధంగా ఉండాలి. సౌర విద్యుత్తు, బయోగ్యాస్, ఇండక్షన్ స్టౌల వినియోగంతో పాటు పట్టణాల్లో పీఎన్‌జీ కనెక్షన్లకు మారాలి. వంట చేసే విధానంలోనూ మార్పులు చేసుకోవాలి' అని మనోహర్ సూచించారు. వంటగ్యాస్‌ని ఇతర అవసరాలకు మళ్లించేవారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామని, 9 ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 'వంటగ్యాస్ సరఫరా, ప్రత్యామ్నాయ చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. ఇంధన సంస్థలతో సమన్వయం చేసుకుంటూ.. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరిస్తున్నాం. 21న విశాఖపట్నం రావాల్సిన నౌక 26వ తేదీకి చేరుకుంటుంది. అది వస్తే గ్యాస్ సరఫరాలో అంతరాయం ఉండదు' అని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో చేసే తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పట్టణాల్లో పీఎన్‌జీ (పైప్డ్ నేచురల్ గ్యాస్) పంపిణీపై చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. 2.60 లక్షల పీఎన్‌జీ కనెక్షన్లు ఇచ్చేందుకు సరిపడా మౌలిక సౌకర్యాలున్నాయి. దీనిపై సోమవారం సాయంత్రానికి ప్రణాళిక సిద్ధం చేస్తాం.

వాణిజ్య సిలిండర్లలో తొలుత విద్యాసంస్థలు, హాస్టళ్లకు ప్రాధాన్యం ఉంటుంది. తర్వాత ఆసుపత్రులు, అన్నక్యాంటీన్లు, హోటళ్లు, రెస్టారెంట్లకు అందిస్తాం.

54వేల అంగన్‌వాడీలకు ఇండక్షన్ స్టౌలు అందించాం. తప్పనిసరిగా వాటిని వినియోగించాలి.

ఆన్‌లైన్‌లో సిలిండర్ బుక్ చేస్తే మూడు రోజుల్లో డెలివరీ చేస్తున్నాం. గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లి గంటలకొద్దీ నిల్చోవాల్సిన పనిలేదు. డెలివరీ సమయంలో ఓటీపీ తప్పనిసరిగా చెప్పాలి.

నిత్యావసర ధరలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. రవాణా భారం వల్ల పామోలిన్, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరలు 10% పెరిగాయి.

# పిరికి పందల్లారా.. అమెరికా లేకుంటే మీరు కాగితపు పులులు

-మొదటిపేజీ తరువాయి

గుర్తుంచుకుంటామని ట్రంప్ స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జల సంధిని ఇరాన్ బ్లాక్ చేసిన విషయం తెలిసిందే. కాదు కూడదు అని ముందుకెళ్లే నౌకలపై ఇరాన్ దాడులు చేస్తోంది. ఇరాన్ దెబ్బతో ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణాకు ఆటంకం ఏర్పడింది. కొన్ని దేశాల్లో ఇంధన సంక్షోభం తలెత్తింది. ఈ క్రమంలో ప్రపంచ దేశాలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక పిలుపునిచ్చారు. హార్మూజ్ జల సంధిలో చమురు నౌకలను కాపాడుకునేందుకు ఆయా దేశాలు తమ యుద్ధ నౌకలను పంపాలని పిలుపునిచ్చారు. హార్మూజ్ జల సంధిలో యుద్ధ నౌకలను మోహరించాలని కోరారు. ఇరాన్ నుంచి హార్మూజ్ జల సంధికి స్వేచ్ఛ కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అయితే.. ట్రంప్ పిలుపుకు ఆశించిన స్పందన రావడం లేదు. హార్మూజ్ జల సంధిలో యుద్ధ నౌకలు మోహరించేందుకు చైనా నిర్ద్వందంగా తిరస్కరించింది. బ్రిటన్ కూడా ఇందుకు సముఖత వ్యక్తం చేయలేదు. యుద్ధం ఇప్పుడు ముగిస్తారో ముందు ట్రంప్ స్పష్టంగా చెప్పాలని యూరప్ కంట్రీస్ డిమాండ్ చేశాయి. ఇక, ఇండియా అయితే ఈ అంశంపై రెస్పాండే కాకపోవడం గమనార్హం. హార్మూజ్ జల సంధి విషయంలో తన పిలుపును పట్టించుకోని దేశాలపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో హార్మూజ్ జల సంధి రక్షణ కోసం షరతులతో యూరప్ దేశాలు ముందుకు వచ్చాయి. కండీషన్స్ పెట్టడంతో నాటో కూటమిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# షర్మిల పిల్లలకు జగన్ అన్యాయం

-మొదటిపేజీ తరువాయి

పత్రికల్లో అసత్య ప్రచారాలు చేస్తున్న నేపథ్యంలో ఆస్తుల వ్యవహారంపై ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పడానికి విజయమ్మ శుక్రవారం నోటరీ ద్వారా బహిరంగ ప్రకటన విడుదల చేశారు. 2009లో రాజశేఖరరెడ్డి మరణించేనాటికి ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులేనని విజయమ్మ స్పష్టం చేశారు. ఈ ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగలేదన్నారు. ఉన్న ఆస్తులన్నింటినీ మనవలు, మనవరాళ్లు నలుగురికీ సమానంగా ఇవ్వాలన్నది వైఎస్సార్ ఉద్దేశం, ఆదేశం అన్నది సన్నిహితులందరికీ తెలిసిన వాస్తవమేనని పేర్కొన్నారు. సరస్వతి, యలహంక భూమి కూడా షర్మిలదే: అవగాహన ఒప్పందం (ఎంఓయూ)లో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తీ న్యాయంగా ఆమెకు చెందాల్సినదేనని విజయమ్మ లేఖలో పేర్కొన్నారు. అందువల్లనే జగన్ ఎంఓయూ సిద్ధం చేశారని, వాస్తవానికి షర్మిలకు దక్కాల్సిన దానికంటే జగన్ తక్కువగానే ఇచ్చాడన్నారు. సరస్వతితో సహా ఎంఓయూలో లేని యలహంక భూమి కూడా షర్మిలదేనని వెల్లడించారు. ఇప్పటి వరకు షర్మిలకు ఇచ్చానని చెబుతున్న సొమ్ము ఆమె వాటాకు వచ్చిన డివిడెండ్ మాత్రమేనన్నారు.

వైఎస్సార్ మరణం వరకు ఆస్తుల పంపకం జరగలేదన్నారు. షర్మిలకు ఇచ్చినట్లుగానే జగన్‌కు కూడా ఆస్తులు ఇచ్చారని.. అది ఆస్తి పంపకం కాదని స్పష్టం చేశారు. నిజమేంటో నా దేవుడికి, నా కుమారుడికి తెలుసని విజయమ్మ పేర్కొన్నారు. గోబెల్స్ ప్రచారం చేయడానికి మీరెవరని ప్రశ్నించారు. మీరు ఎంత కాదన్నా దేవుడి న్యాయమే న్యాయం అని వ్యాఖ్యానించారు. అసత్య ప్రచారం మానుకోవాలని, మళ్లీ మళ్లీ మీడియాలో ప్రస్తావించవద్దని వైఎస్సార్ భార్యగా చేతులు జోడించి అడుగుతున్నానని పేర్కొన్నారు. ప్రకటనలో రాసినవన్నీ వాస్తవాలేనని దేవుడి సాక్షిగా విజయమ్మ వెల్లడించారు.

**ఇదీ నేపథ్యం..**

ఎంఓయూలో భాగంగా సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్‌లో వైఎస్ జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీలకు చెందిన వాటాలను విజయమ్మకు కేటాయించారు. క్లాసిక్ రియాల్టీ నుంచి కొన్న వాటాలతోపాటు జగన్, భారతిలు కేటాయించిన వాటాలను తన పేరుతో బదలాయించాలంటూ సరస్వతి బోర్డుకు గతంలో విజయమ్మ లేఖ రాశారు. ఆ మేరకు విజయమ్మ పేరుతో వాటాలను బదలాయిస్తూ సరస్వతి కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ తీర్మానం చేసింది. దీంతో జగన్ యూ టర్న్ తీసుకున్నారు. చెల్లిపై ప్రేమతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నానని, ఇప్పుడు ఆ ప్రేమ లేనందున ఒప్పందాన్ని ఉపసంహరించుకుంటున్నానని జగన్ వెల్లడించారు. రాజకీయంగా తనతో విభేదించడమే దీనికి కారణమన్నది అందరికీ తెలిసిన వాస్తవమే. విజయమ్మ పేరుతో వాటాల బదలాయింపు చెల్లదంటూ తల్లిపై జగన్ ఏకంగా కోర్టుకెళ్లారు. ఓవైపు తల్లిపై ప్రేమ ఉందంటూనే ఆమెపై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వివాదం చెన్నైలోని ఎన్‌సీఎల్‌ఏటీలో పెండింగ్‌లో ఉంది.

# ప్రీమియం పెట్రోల్ ధర రూ.2 పెంపు

-మొదటిపేజీ తరువాయి

వర్గాలు వెల్లడించాయి. సవరించిన ధరలు శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చాయి. కాగా, ఢిల్లీలో సాధారణ పెట్రోలు ధర లీటరుకు రూ 94.77గా, సాధారణ శ్రేణి డీజిల్ ధర యథాతథంగా లీటరుకు రూ 87.67గా కొనసాగుతోంది.

**ఏమిటీ ప్రీమియం పెట్రోల్?**

పెట్రోల్ గ్రేడ్‌ను దాని ఆక్టేన్ విలువ ఆధారంగా వర్గీకరిస్తారు. భారత్‌లో సాధారణ పెట్రోల్ ఆక్టేన్ విలువ 91-92 కాగా, అదే ప్రీమియం పెట్రోల్ ఆక్టేన్ విలువ 95-98గా ఉంది. హై ఆక్టేన్ కలిగిన ఇంధనం ఎక్కువ కంప్రెషన్ రేషియోను కలిగి ఉంటుంది. దీని ఫలితంగా, వాహనం ఇంజిన్‌ను స్టార్ట్ చేసే సమయంలో ఎక్కువ ఇంధనం తీసుకోదు. అంతేకాదు కార్బన్‌పై తక్కువ ప్రభావాన్ని చూపుతుంది. శక్తిమంతమైన ఇంజిన్లు కలిగిన స్పోర్ట్స్ కార్లు, బైక్‌లు, సూపర్ కార్లు, మొదలైన వాటికి ఈ ప్రీమియం పెట్రోల్ ఉత్తమంగా నిపుణులు చెబుతారు.

# ఐఆర్‌జీసీ కీలక కమాండర్ మృతి

-మొదటిపేజీ తరువాయి

ప్రకటించారు. కానీ శుక్రవారం దాడుల్లో మృతిచెందారు. కాగా, తమ దేశంపై అన్యాయంగా దాడులు చేస్తున్న శత్రుదేశాల వారు పార్కుల్లో, పర్యాటక ప్రదేశాల్లో ఉన్నా సరే వదలబోమని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ జనరల్ అబోల్‌ఫజల్ షెకార్చి హెచ్చరించారు.

# 20 నెలల్లో 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించాం

-మొదటిపేజీ తరువాయి

లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు ఏటా ఉగాది రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారు" అని పార్థసారథి తెలిపారు. జగన్ ప్రభుత్వంలో నిరుద్యోగితలో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉండేదని గుర్తుచేశారు. 'ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం వైకాపా హయాంలో ఉపాధి లేక 4,100 మంది యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పట్లో గ్రాడ్యుయేట్లలో 24 శాతం మంది నిరుద్యోగులుగా మిగిలిపోయారు. 2.3 లక్షల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని యువతను జగన్ మోసం చేశార'ని ఆరోపించారు. జగన్‌కు హిందూ పండుగలు, దేవుళ్లపై నమ్మకం లేదని, ఇంటి పక్కనే ఆలయాలున్నా అక్కడికి వెళ్లకుండా తాడేపల్లి ప్యాలెస్‌లో సెట్టింగ్‌లు వేయించి, ఫొటోలకు పోజులిస్తారని మంత్రి విమర్శించారు.


# త్వరలో శ్రీకాకుళం నుంచి తిరుపతి, హైదరాబాద్‌కు రైళ్లు

-మొదటిపేజీ తరువాయి

జరుగుతోందని వివరించారు. శ్రీకాకుళం జిల్లాలో మూడు రైళ్ల హాల్ట్‌లను ఆయన శుక్రవారం ప్రారంభించారు. హరిశ్చంద్రపురం రైలునిలయంలో రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు, డీఆర్ఎం లలిత్‌బోహ్రాలతో కలిసి గుణుపూర్- విశాఖ ఎక్స్‌ప్రెస్, పాతపట్నం రైలు నిలయంలో పర్లాఖెముండి(ఒడిశా) ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహితో కలిసి రవుర్కెలా నుంచి గుణుపురం వెళ్లే రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్, మందస రైలు నిలయంలో బ్రహ్మపురం-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ హాల్ట్‌లను జెండా ఊపి రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు.

# ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు

- సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబు ఈద్ ముబారక్ సందేశం
- ఉపవాస దీక్షలు, ప్రార్థనలు మంచి మార్గంలో నడిపిస్తాయన్న సీఎం
- దానధర్మాల వల్ల సమాజంలో సమానత్వం పెరుగుతుందని వ్యాఖ్య
- ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, శాంతి నిండాలని ఆకాంక్ష




పవిత్ర రంజాన్ (మార్చి 21) పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలోని ముస్లిం సోదరసోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా తన సందేశాన్ని పంచుకున్నారు."పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరసోదరీమణులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన ఈ రంజాన్ నెలలో ఉపవాసదీక్షలు, ప్రార్థనలు మనసును పవిత్రం చేసుకోవడానికి, మంచి మార్గంలో నడవడానికి, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందించడానికి ఒక మంచి అవకాశం. పేదలకు దానం చేయడం ద్వారా సమాజంలో సమానత్వం పెరుగుతుంది. ఈ రంజాన్ మీ జీవితంలో ఆనందం, శాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షిస్తున్నాను. మీరు చేసే ప్రతి ప్రార్థనకు అల్లాహ్ ఆశీస్సులు లభించి, మీ కోరికలు అన్నీ నెరవేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటుంటూ.... ఈద్ ముబారక్" అంటూ చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన వంగలపూడి అనిత





- స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు పటిష్ట ఏర్పాట్లు అనిత.
- సిఎం పర్యటన ఏర్పాట్ల పై అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్.

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 19 :** ఈ నెల 23 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆర్సెలార్ మిట్టల్–నిప్పన్ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాలో నక్కపల్లి మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను రాష్ట్ర హోం శాఖ మాత్యులు వంగలపూడి అనిత పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, ఎస్ పి. తుహిన్ సిన్హా లతో కలసి నక్కపల్లి మండలంలో ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాలను సందర్శించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను గమనించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పై అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.

నక్కపల్లి మండలం ఆర్సెలార్ మిట్టల్–నిప్పన్ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ఈ నెల 23 న జరగనున్న భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా పలువురు మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరు కానున్నారని అందుకు తగ్గ ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో బహిరంగసభ ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, హెలీప్యాడ్, వాహనాల పార్కింగ్ పనులను శుక్రవారం సాయంత్రం కలెక్టర్ విజయ్ క్రిష్ణన్ పరిశీలించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లు ఎక్కడివరకు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. సమయం తక్కువ ఉన్నందున అధికారులు, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. సభకు హాజరయ్యే ప్రజలకుఎటు వంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.



ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, విఎంఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, నక్కపల్లి అడ్డురోడ్డు ఆర్డీ వో వీవీ రమణ, పలుశాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ' ప్రజా దర్బార్ '



బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు

**బాపట్ల,పెన్ సత్తా,మార్చి 20** :నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ' ప్రజా దర్బార్ ' కార్యక్రమం నిర్వహిస్తున్నామని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు.బాపట్ల నియోజకవర్గ సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు శుక్రవారం బాపట్ల పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న ' నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ' కార్యాలయంలో ' ప్రజా దర్బార్ ' కార్యక్రమాన్ని నిర్వహించారు.బాపట్ల నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి,గ్రామాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజల వద్ద నుండి శాసనసభ్యులు స్వయంగా అర్జీలను స్వీకరించారు.ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత సమస్యలతో పాటు,గ్రామాలలోని మౌలిక వసతుల సమస్యలను ఆయన సావధానంగా విన్నారు.సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి,అర్జీలపై సానుకూలంగా స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ.....ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తీర్చడమే ఈ ' ప్రజా దర్బార్ ' ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ప్రతి ఫిర్యాదును పరిష్కరించే వరకు పర్యవేక్షిస్తామని హామీ ఇచ్చారు.

# రంజాన్ పండుగ సందర్బంగా జిల్లాలోని మసీదులు,ఈద్గా ల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు -జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్

**బాపట్ల,పెన్ సత్తా,మార్చి 20** :రంజాన్ పండుగ సందర్బంగా బాపట్ల జిల్లాలోని మసీదులు,ఈద్గా ల వద్ద శనివారం పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ తెలిపారు.ప్రశాంతమైన వాతావరణంలో ముస్లిం సోదరులు రంజాన్ పండుగ జరుపుకునేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.శుక్రవారం రంజాన్ ఉపవాసాలు ముగించుకుని మార్చి 21 న శనివారం ' ఈద్ – ఉల్ – ఫితర్ ' జరుపుకునేందుకు సిద్ధమవుతున్న ముస్లిం సోదర,సోదరీమణులకు జిల్లా ఎస్పీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.....రంజాన్ పండుగ సందర్భంగా జిల్లాలోని ముస్లింల ప్రార్ధనా స్థలాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ముస్లిం సోదరులు పండుగ జరుపుకునే విధంగా తగిన ముందస్తు భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు.ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఆయా ప్రాంతాలలో తగిన ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు.జిల్లాలోని మసీదులు,ఈద్గా ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో పాటు నిఘా కోసం డ్రోన్ లను కూడా వినియోగిస్తున్నామన్నారు.సోషల్ మీడియా వేదికలపై నిఘా ఉంచామన్నారు.ఎవరైనా కుల మత వైషమ్యాలను రెచ్చగొట్టే విధంగా వదంతులు వ్యాప్తి చేస్తే సంబంధిత వ్యక్తులపై,గ్రూప్ నిర్వాహకులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సర్వమత సమ్మేళనమైన భారతదేశంలో ప్రతి ఒక్కరూ ఇతరుల




మనోభావాలను గౌరవించుకుంటూ,శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను పాటిస్తూ ప్రశాంతమైన వాతావరణంలో సంతోషంగా రంజాన్ పండుగ జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ రంజాన్ అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపి సుఖ సంతోషాలను కలుగజేయాలని ఆకాంక్షించారు.

## ఉపమాక రామాలయం లో సప్తాహం ప్రారంభం



**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 20** :మండలంలోని ఉపమాక మెరక వీధి రామాలయంలో ఈనెల 27 న జరిగే శ్రీరామనవమి వేడుకలను వేడుకలను పురస్కరించుకొని సప్తాహం (7రోజుల భజన ) శుక్రవారం ఉదయం 6 గంటలకు ఘనంగా ప్రారంభమైంది. గ్రామానికి చెందిన శ్రీ శ్రీనివాసా భజన భక్త సమాజం ఆధ్వర్యంలో 7 రోజుల పాటు జిల్లాలో వివిధ గ్రామాల నుండి భజన బృందాలు పాల్గొని భజన కార్యక్రమాన్నినిర్వహిస్తున్నారు. సప్తాహం ప్రారంభంలో భాగంగా ముందుగా గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. 20 వ తేదీ శుక్రవారం ఉదయం 6 గంటల నుండి ప్రారంభమైన భజన కార్యక్రమం ఈనెల 27 వ తేదీ శుక్రవారం ఉదయం 6 గంటల వరకు నిరంతరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు.

## శివపార్వతుల కళ్యాణానికి పెండ్లి రాటోత్సవం



**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 20** :ఉపమాక శ్రీ భువనేశ్వరి దేవి సమేత లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 29 వ తేదీన జరిగే శివపార్వతుల వార్షిక కళ్యాణ మహోత్సవ పెండ్లి రాటోత్సవం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన పలువురు భక్తులు శుక్రవారం ఉదయం శివపార్వతుల పెండ్లి రాటోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పెండ్లిరాట వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రగడ వీరబాబు, పాయకరావుపేట టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, నక్కపల్లి పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, దవర్ సింగ్ రాంబాబు, ఆలయ అర్చకులు మహేష్, జగదీష్, తోలేటి శ్రీను, వాసు తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితుల నోట్లో మట్టి కొట్టి స్టీల్ ప్లాంట్ కు భూమి పూజ?



**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 20 :** ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల నోట్లో మట్టి కొట్టి స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ ఎలా చేస్తారని సిపిఎం నాయకులు అన్నారు. శుక్రవారం సిపిఎం ప్రతినిధి బ్రందం ఆర్ అండ్ ఆర్ కాలనీలో పర్యటించి నిర్వాసితులు సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం మాట్లాడుతూ ఆర్సెలార్ మిట్టల్, నిప్పాను స్టీల్ ప్లాంట్ కొరకు భూములు, ఇల్లులు కోల్పోయిన నిర్వాసితులు సమస్యలు పరిష్కారం చేయకుండా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కు భూమి పూజ ఎలా చేస్తారని ప్రశ్నించారు, కూటమి ప్రభుత్వం మిట్టల్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి ఎంత తొందరగా భూములు అప్పగిద్దాం ఏ విధమైన సేవలు చేద్దాము అనే యావ తప్ప సర్వం కోల్పోయిన నిర్వాసితులను ఎలా ఆదుకుందామనే ఆలోచనే లేదని తెలిపారు. గృహ నిర్మాణం ముడి సరుకులు

సబ్సిడీపై ఇస్తామని, పునాదులు కప్పు కోవడానికి గ్రావెల్, ఇంటి నిర్మాణ సమయంలో ఉచితంగా కరంట్ అందిస్తామని హామీలు ఇచ్చిన అదికారులు మాట తప్పారని ఇది ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. నిర్వాసితులకు ఇచ్చిన ప్యాకేజీ పెరిగిన ధరలు వలన ఇల్లు నిర్మించుకోవడానికి సరిపోదని 25 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలని పోరాడినా ప్రభుత్వం పట్టించు కోలేదని అన్నారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి జీ. కోటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. అప్పలరాజు మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం సెక్షన్ 32 ప్రకారం నిర్వాసితుల కాలనీలో ప్రభుత్వం సౌకర్యాలు కల్పించి ఇల్లు ఖాళీ చేయించాలని కానీ ప్రభుత్వ అదికారులు చట్టాలను ఉల్లంఘించి నిర్వాసితులను భయబ్రాంతులకు గురి చేసి మిట్టల్ మెప్పు కోసం ఇల్లు లు నేలమట్టం చేసి నిర్వాసితులను నడిరోడ్డుమీదకు నెట్టారని అన్నారు. నిర్వాసితులందరికీ ఆర్ కార్డు లు ఇవ్వాలని నిర్వాసితులకు, స్థానికులకు డబ్బై ఐదు శాతం ఉద్యోగాలు ఇవ్వాలని దీనిపై ప్రభుత్వం కంపెనీ యాజమాన్యం తో ఒప్పందం చేయాలని డిమాండ్ చేసారు.

ఈ కార్యక్రమం లో నాయకులు ఎం. మహేష్ బాబు, వై. నవీన్,జీ. రమణ, కె.దేవుడు,ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో రైతు భరోసా నిధులు విడుదల చేయనున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం.

- నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో ఈనెల 22వ తారీకు ఆదివారం రోజున రైతు భరోసానిధుల విడుదల మరియు పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం చెయ్యనున్న ముఖ్యమంత్రి శ్రీ ఏనుమల రేవంత్ రెడ్డి



**చేగుంట పెన్ సత్తా, మార్చి 20** :రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్. అక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా కోటి 50 లక్షల మంది రైతులకు ఎకరానికి 6000 చొప్పున మొత్తం సుమారు ?9,000 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేయనున్నారని తెలిపారు. డెబిట్ ద్వారా నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుంది.మార్చి 22, 2026 ఆదివారం రోజున రైతు భరోసా నిధులు విడుదల గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో తొలి విడత నిధులు విడుదల చేస్తారు అని మరియు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తారని తెలిపారు.

ఎలా విడుదల చేస్తారు?

ఈసారి ఒక పెద్ద మార్పు చేశారు.

సుమారు 70 లక్షల రైతులకు ఒకేసారి మొదటి విడత డబ్బులు జమ చేస్తారు.

ప్రతి అర్హుడైన రైతుకు కనీసం 1 ఎకరానికి సాయం మొదటి విడతలోనే రైతు భరోసా అందుతుంది.

విడతల వివరాలు.

1వ విడత: మార్చి 22 నాడు.

2వ విడత: సుమారు 20 రోజులలో

3వ విడత: ఏప్రిల్ చివర్లో రైతు భరోసా నిధులు విడుదల పూర్తి అవుతుంది అని తెలిపారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో ఈనెల 22 తారీకు ఆదివారం రోజున రైతు భరోసా నిధుల విడుదల మరియు ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి విచ్చేస్తున్న సందర్భంగా రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరిన దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్.

## మెదక్ డిసిసి కార్యదర్శిగా బుడ్డ భాగ్యరాజ్ నియామకం



**చేగుంట పెన్ సత్తా, మార్చి 20** :చేగుంట / మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కీలక నియామకం చోటుచేసుకుంది. పార్టీ బలోపేతం లక్ష్యంగా, లయన్ బుడ్డ భాగ్యరాజ్ ను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ పి. మహేష్ కుమార్ గౌడ్ శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకంతో జిల్లాలో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన లయన్ బుడ్డ భాగ్యరాజ్ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు,కి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "మీ ప్రేమే నా బలం, మీతో ఈ బంధమే నా ఊపిరి. మీ అందరి ఆశీస్సులతో మరింత బాధ్యతగా, శక్తివంతంగా పనిచేస్తాను. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తాను" అని ఆయన స్పష్టం చేశారు.
అలాగే జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులైన ఏఎంసీ మాజీ చైర్మన్ రజనకు, ప్రవీణ్ కుమార్‌కు కూడా ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ నియామకం ద్వారా మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి కొత్త ఊపు లభిస్తుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ముస్లిం సోదర,సోదరీమణులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు- ఎస్పీ రోహిత్ రాజు.




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, మార్చి 20** ముస్లిం సోదర సోదరీమణులకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ముస్లిం సోదరులు ఈ పవిత్ర పండుగను కుటుంబ సభ్యులతో కలిసి అనందంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. రంజాన్ మాసంలో ముస్లీం సోదరులు చేసిన కఠిన ఉపవాస దీక్షలను ఈద్-ఉల్-ఫితర్ పండుగతో ముగిస్తారని అన్నారు.ఈ రంజాన్ పండుగ సందర్భంగా ప్రజలందరూ సోదర భావాన్ని కలిగియుండి సుఖసంతోషాల తో, ఆయురారోగ్యాల తో సంతోషంగా గడపాలని కోరారు.

# మొక్కజొన్న ప్లాస్టిక్ సంచుల గుట్టలు - పర్యావరణానికి పెరుగుతున్న ముప్పు

- ప్లాస్టిక్ కాల్చితే విషపూరిత పొగ -- ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం
- పర్యావరణ పరిరక్షణపై ప్రశ్నలు -- బాధ్యులు ఎవరు?



**ఏన్కూరు పెన్ సత్తా, మార్చి 20** మండల పరిధిలోని అగ్రికల్చర్ మార్కెట్ కార్యాలయం సమీప ప్రాంతం ప్రస్తుతం ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడం స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణమైంది. ముఖ్యంగా మార్కెట్ పక్కన ఉన్న ముస్లిం ఖబరస్థాన్ స్మశాన వాటిక ప్రాంగణం చుట్టూ వందల సంఖ్యలో మొక్కజొన్నకు ఉపయోగించిన ప్లాస్టిక్ సంచులు చెత్తగా పేరుకుపోయిన దృశ్యాలు కనిపిస్తున్నాయి.

ప్రైవేట్ కంపెనీల నిర్లక్ష్యమే కారణమా?

స్థానికుల కథనం ప్రకారం, ప్రైవేట్ కంపెనీలు రైతులకు క్రాసింగ్ మొక్కజొన్న విత్తనాలను సరఫరా చేస్తూ కోతల సమయంలో మొక్కజొన్నను తరలించేందుకు పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ సంచులను అందజేస్తున్నాయి. మొక్కజొన్నను ఈ సంచుల్లో ప్యాకింగ్ చేసి లారీల ద్వారా మార్కెట్‌కు తరలించిన అనంతరం, లారీలలో లూజ్‌గా లోడ్ చేసుకునే సమయంలో సంచులను అక్కడికక్కడే వదిలేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శుభ్రత లేక చెత్త కుప్పలుగా మారిన ప్రదేశం

ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో ప్లాస్టిక్ సంచుల గుట్టలు రోజురోజుకు పెరుగుతూ ఉండటంతో అక్కడి పరిసరాలు చెత్త కుప్పలను తలపిస్తున్నాయి. గాలి వీచినప్పుడల్లా ఈ సంచులు చుట్టుపక్కల పొలాలు, చెట్లు, రోడ్లపైకి ఎగిరిపడుతున్నాయని రైతులు చెబుతున్నారు. దీంతో వ్యవసాయ భూములపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాల్చితే విషపూరిత పొగ -- ఆరోగ్య సమస్యలు

కొంతమంది ఈ ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు కాల్చడం ప్రారంభించడంతో విషపూరిత పొగ వాతావరణంలో వ్యాపిస్తోంది. ఈ పొగను పీల్చడం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు మరియు శ్వాసకోశ సమస్యలు ఉన్నవారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీర్ఘకాలంలో ఇది ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారే అవకాశం ఉందని వైద్యులు కూడా సూచిస్తున్నారు.

పర్యావరణంపై దీర్ఘకాల ప్రభావం

ప్లాస్టిక్ సంచులు భూమిలో త్వరగా కరిగిపోవు. ఇవి నేల సారాన్ని తగ్గించడమే కాకుండా వర్షపు నీటి ప్రవాహాన్ని కూడా అడ్డుకుంటాయి. అదేవిధంగా పశువులు వీటిని తిని అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే గ్రామ పరిసరాలు కాలుష్యానికి కేంద్రంగా మారే ప్రమాదం ఉందని పర్యావరణంపై చింతిస్తున్న వారు అంటున్నారు.

అధికారుల జోక్యం తప్పనిసరి

ఈ సమస్యపై వ్యవసాయ శాఖ, మార్కెట్ యార్డు అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది కలిసి ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపట్టి ప్లాస్టిక్ వ్యర్థాలను తక్షణమే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రైవేట్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిబంధనలు అమలు చేయాలని కోరుతున్నారు.

అవగాహన -- శాశ్వత పరిష్కారం

రైతులకు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, వ్యర్థాల సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయడం, పర్యావరణానికి హానికరమైన పదార్థాల వినియోగాన్ని తగ్గించే చర్యలు తీసుకోవడం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గ్రామ పరిసరాల పరిశుభ్రత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# విద్యా రంగానికి లో బడ్జెట్ నిధులు: తపస్



**చేగుంట / పెన్ సత్తా, మార్చి 20** చేగుంట మండల, తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ
పెండింగ్ బిల్లులు, పిఆర్సీ ప్రస్తావన లేకపోవడం దారుణం అని,ఉద్యోగుల ఆరోగ్య పథకం క్రింద ఉచిత వైద్యం స్వాగతించాల్సిన అంశమే అయినా నిర్దిష్ట నిధులు సరిపోవు అని,2026 - 27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ 3,24,234 కోట్ల బడ్జెట్ లో విద్య, మానవ వనరులకు కేటాయించింది 26,674 కోట్లు మాత్రమే. ఇది మొత్తం బడ్జెట్లో 8.2% అని, గత సంవత్సరం కంటే రూ 3,566 కోట్లు అదనంగా కేటాయించినప్పటికీ పెంచిన మొత్తం బ్రేక్ ఫాస్ట్, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజన పథకం విస్తరణ, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు విటన్నిటి కోసంసరిపోవు అని,విద్యకు 15% కేటాయిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్న హామీ వరుసగా మూడవ బడ్జెట్ లో కూడా నెరవేరలేదు అని, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ను సమీక్షించి కనీసం 18% కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ చేగుంట మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేష్, తంగేళ్లపల్లి కృష్ణమూర్తి, తపస్ జిల్లా నాయకులు సురేందర్, దేశపతి కృష్ణమూర్తి, రమేష్, బాల్ శెట్టి రేఖ,సుమతి, అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు,

# క్రషర్ తో క్రష్ అవుతున్న పర్యావరణం, మానవుల జీవన పరిస్థితులు: శంకర్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు.



**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెన్ సత్తా, మార్చి 20** హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర స్టోన్ క్రషర్ యాజమాన్యం కొండల్ని పిండిచేస్తున్నారు. నేల, నీరు, మానవుల ఆరోగ్యాలు, వారి ఆవాసాలు ఏమైనా పర్లేదు,పట్టింపు లేదు. బాధ్యత లేదు. తమ స్వలాభం కోసం పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నారు.రాతి పొడి, దుమ్ము పంట పొలలాని ముంచెత్తడం వల్ల సరైన దిగుబడి రావట్లేదని రైతులు ఉసురు మంటున్నారు, అంతేకాదు పరిమితికి మించి తవ్వకాలు చేయడం వల్ల ఆ భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి బోరు బావులు కూలిపోతున్నాయి.

గుట్టల్ని పేల్చడం వల్ల వచ్చు శబ్దకాలుష్యం మరియు వాటి నుండి వెలుపడే విషావాయయుల వల్ల అనేకమంది ప్రజలు అనారోగ్యపాలు అవుతున్నారు, చిన్నపిల్లల నుండి వృద్ధుల వరకు ఆయాసం, నిమోనియా, ఊపిరితిత్తుల శ్వాస సంబంధమైన వ్యాధులతో బాధపడుతున్నారు. గ్రామ ప్రజల ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయి జంతు జలాలు తమ ఆవాసాన్ని కోల్పోయి ఇండ్లలోకి చొరబడుతున్నాయి.

క్రషర్ వాళ్లు బండలకు బాంబులు పెట్టి పేల్చడం వల్ల వాటి యొక్క చిన్న చిన్న రాళ్లు పంట పొలాల్లో పడుతున్నాయి తద్వారా రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పరిమితికి మించి తవ్వకాలు జరిగినట్లయితే రియాల్టీ పెనాల్టీలు విధించాలి.

స్టోన్ క్రషర్, హాట్ మిక్స్ ప్లాంటు నిర్వహణ, ఏర్పాటు నిబంధనల అమలును పరిశ్రమల శాఖ, మైనింగ్, విద్యుత్ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి వంటి విభాగాలు పర్యవేక్షించాలి.

ప్రభుత్వానికి, పాలకవర్గానికి నా చిన్న సలహా మరియు మనవి:పర్యావరణానికి పంటలకు ఇళ్లకు మానవులు ఆరోగ్యానికి ముప్పు తీసుకొచ్చే ఇలాంటి క్రషర్ల కంటే అనేకమంది నిరుద్యోగులకు ఉపయోగపడే ఒక మంచి కంపెనీ తీసుకొని వచ్చి గ్రామాల నుండి పట్టణాలకు వలస బాటపడుతున్న అనేకమంది నిరుద్యోగుల జీవితాల్లో వెలుగుల్ని నింపాలని ఆశిస్తున్నాను.

# రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు బట్టి విక్రమార్క చొరవతో సీసీ రోడ్డులుకు నిధులు మంజూరు

**చింతకాని పెన్ సత్తా, మార్చి 20** ప్రతినిధి.చింతకాని మండలం నేరడ గ్రామంలో మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి 11 లక్షలు సిసి రోడ్లు నిధులు మంజూరులో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు సహకారంతో ఈ రోజు గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ పసుపు కుంకు వేసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అర్జున్ గ్రామ ఉప సర్పంచ్ కోట బాలేష్ గ్రామ వార్డు సభ్యులు అన్నపురెడ్డి వెంకటేశ్వర్లు అమడాల వెంకటేష్ గ్రామ కాంగ్రెస్ సిపిఐ పార్టీలు అధ్యక్షులు కార్యదర్శి మంకెన నాగేశ్వరరావు షేక్ దస్తగిరి దూసరి శ్రీరాములు అలిశ్వం గడ్డమీద వెంకయ్య చెవుల తిరపతిరావు వంకాయలపాటి మాధవరావు షేక్ లాలు షేక్ రహిమాన్ పఠాన్ సోందు షేక్ ఉస్సేన్ మియా చిన్నసైదా కనకపూడి రాములు పులిపాటి వెంకన్న భద్రయ్య పగిళ్ళపల్లి నర్సింహరావు అన్నపురెడ్డి పుల్లయ్య లక్ష్మయ్య చిత్రా రాము షేక్ బాబు షేక్ బిక్కుసాహెబ్ షేక్ బాబు మేడా భాస్కర్ జి నవీన్ షేక్ పాషా షేక్ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు


# శ్రీ ఈటల రాజేందర్ గార్కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి నాయకులు కొండ శివగౌడ్



**ఆత్మకూర్ యం పెన్ సత్తా, మార్చి 20** శ్రీ ఈటెల రాజేందర్ గారి జన్మదిన సందర్భంగా, వారి శామీర్పేట్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన కొండ శివ గౌడ్ బిజెపి నాయకులు భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం

# మండల కేంద్రం చింతకానిలో మార్క్ఫెడ్ కేంద్రం ఏర్పాటు.

- ప్రారంభించినసొవీజ చైర్మన్ అంబటి.కార్యక్రమంలో పాల్గొన్న మక్క సాగు రైతుల మండల కమిటీ.



**చింతకాని పెన్ సత్తా, మార్చి 20** ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈరోజు సొసైటీ చింతకాని
అధ్యర్యంలో చింతకాని లో మక్క కొనుగోలు కొరకు మార్క్ ఫెడ్ కేంద్రం ఏర్పాటు చెయ్యడం జరిగింది. మార్క్ ఫెడ్ కేంద్రం ఏర్పాటును ప్రారంభించిన లిమత్కేపల్లి సొవీజ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు.లిఈ కార్యక్రమం లో మత్కేపల్లి సొవీజ చైర్మన్ అంబటి, సర్పంచ్ కిలారు మనోహర్, కిసాన్ సెల్ బాద్యులు కొప్పుల గోవిందరావు, సొ మనసా, సొసైటీ జజూ శ్రీనివాస్,=×, సొవీజ ఖమ్మం మాజీ వైస్ చైర్మన్ మాడుపల్లి భాస్కర్, ఐక్య రైతు సంఘం నాయకులు కోలేటి నాగేశ్వరావు, మక్క రైతు సంఘం మండలం అధ్యక్షులు కూచిపూడి విజయ్, కార్యదర్శి నాగయ్య నారపోగు,ఉపాధ్యక్షులు మోహన్ రావు పోలూరి,సహాయ కార్యదర్శి ప్రసాద్,సొవీజ డైరెక్టర్ ఖాజీ, మజీద్, నాగేశ్వరావు, రామారావు, రైతు సంఘం కోశాధికారి వెంకటేశ్వర్లు,పెద్దలు, నాయకులు, వివిధ గ్రామల నుండి రైతులు,సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్లో విద్యార్థులకు తీవ్ర అన్యాయం.

- బడ్జెట్లో ఫీజురియంబర్స్మెంట్ కు నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు.
- విద్యారంగానికి కేటాయించిన 26674 కోట్లలో ఎంప్లాయిస్ జీతాలకే 24వేల కోట్లు పోతాయి.



**వలిగొండ మండలం పెన్ సత్తా, మార్చి 20** అణిచివేత ఎక్కువైతే తుపాకులు పట్టే రోజులు వస్తాయి పల్లగొర్ల మోదీరాందేవ్

నార్కెట్ పల్లి : బడ్జెట్లో విద్యారంగానికి నిధులు కేటాయించకుండా అన్యాయం చేశారన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగాన్ని తీవ్ర అన్యాయం చేసిందన్నారు నార్కట్పల్లి బీసీ భవన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3.24లక్షల కోట్ల బడ్జెట్లో విద్యా రంగానికి కేవలం 8% అంటే 26674నిధులు కేటాయించడం అన్యాయం రాజ్యాంగం లోని కోటరీ కమిషన్ విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో 20% నిధులు కేటాయించాలంటే కేవలం 8 శాతం నిధులు కేటాయించడం అన్యాయం ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ల ఊసే లేదు 4000 నిరుద్యోగ భృతి రెండు లక్షల ఉద్యోగాలను గోవింద కొట్టారు ప్రభుత్వానికి మూసి ప్రాజెక్టు ఫోర్త్ సిటీకి లక్షల కోట్లు ఉంటాయి అలాగే స్కైవర్లు ఫ్లై ఓవర్లు నిర్మించడానికి డబ్బులు ఉంటాయి కానీ విద్యార్థులకు ఇవ్వడానికి డబ్బులు లేవంటారా కమీషన్లు వచ్చే పథకాలకే బడ్జెట్ కేటాయింపులు చేశారు ఇతర రాష్ట్రాల విద్యకు ప్రాధాన్యమిస్తూ వాళ్ల రాష్ట్ర బడ్జెట్లో బీహార్ 19 శాతం నిధులు మధ్యప్రదేశ్ 17%, రాజస్థాన్ 16%, కేరళ 14% పక్కనున్న తమిళనాడు 13.5% నిధులు ఆయా రాష్ట్రాలు విద్యకు పెద్దపీట వేసి పరిపాలన చేస్తుంటే తెలంగాణలో మాత్రం విద్యార్థులను బిచ్చ బతుకులు చేసింది ప్రభుత్వం , చేసిన 10 లక్షల కోట్ల అప్పుల్లో విద్యారంగానికి ఒక్క రూపాయి గిట్ల కేటాయించలేదు అయినా అప్పులు మాత్రం పేదలపై మోపుతున్నారు బడ్జెట్లో సంక్షేమ హాస్టళ్లకు మెస్చార్జీలు ఇస్తామన్న ఆలోచన లేదు విద్యా కమిషన్ను వెంటనే ఇంప్లిమెంట్ చేయాలి యూనివర్సిటీల అభివృద్ధి చేస్తామని చెప్పి నీరుగాయించారు కొత్త యూనివర్సిటీల మాటే లేదు విద్యను వ్యాపారం చేయొద్దని భారత రాజ్యాంగంలో ఉన్న విద్యని వ్యాపారస్తుల చేతులో పెట్టి విద్యార్థులతో చెలగాటలాడుతున్నారు ఈ ప్రభుత్వ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి వెంటనే విద్యార్థిల సమస్యలను పరిష్కరించాలి బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 20% నిధులు కేటాయించాలి పేద విద్యార్థులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు లేనిఎడల ఎంపీ ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున మిలిటెంట్ ఉద్యమాలు చేస్తాం కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎంపీ మంత్రులను గెలవుట్ చేస్తామని హెచ్చరించారు ఈ ఈ సమావేశంలో బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, నాగిళ్ల యాదయ్య, మేకల రాములు, లతీఫ్, కప్పల నరసింహ, పీట్ల దుర్గయ్య, మొయినుద్దీన్, బాలు, రుద్రారం యాదయ్య, మత్స్యగిరి, గణేష్ తదితరులు పాల్గొన్నారు

# చేగుంట మండల్ కు 65 లక్షల నిధులు మంజూరు

- మంత్రి వివేక్ వెంకట్ స్వామి, శ్రీనివాస్ రెడ్డి చొరవతో



**చేగుంట పెన్ సత్తా, మార్చి 20** :చేగుంట మండలానికి నిధుల మంజూరు దుబ్బాక నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి చొరవతో జిల్లా ఇంచార్జీ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సహకారం తో మరోసారి చేగుంట మండలానికి 65 లక్షల రూపాయలు నిధులు మంజూరు అయినది.

చేగుంట మండలం లో గ్రామాలే అభివృద్ధి లక్ష్యంగా మరోసారి నిధులు మంజూరు చేసిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గారికి మరియు చెరుకు శ్రీనివాస్ రెడ్డి గారికి చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ వారి తరుపున ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపిన చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్

# రంజాన్ సందర్భంగా మండల ప్రజలకు శుభాకాంక్షలు.



**వలిగొండ మండలం పెన్ సత్తా, మార్చి 20** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఉన్న మొగిలిపాక గ్రామానికి చెందిన అజ్జు మీడియాతో మాట్లాడుతూ.

వలిగొండ మండల ప్రజలకు రంజాన్ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపినారు ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లి విరియాలని ప్రజలందరికీ ఆరోగ్యం ఆయుష ఐశ్వర్యం కలగాలని ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు కొత్త ఆరంభాలు కలగాలని, గత సంవత్సరంలోని కష్టాలను అధిగమించి ఈ సంవత్సరం విజయాల బాటలో నడవాలని, రైతులు పంటలతో సిరి సంపదలు సాధించాలని, యువత తమ లక్ష్యాలను చేరుకోవాలని మహిళలు అన్ని రంగాలలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు,ఉగాది పచ్చడి లాగా జీవితంలో వచ్చే అనుభవాలన్నీటిని సమానంగాస్వీకరించి ముందుకు సాగాలని రంజాన్ శుభాకాంక్షలు తెలిపినారు.

# ప్రజా వ్యతిరేక బడ్జెట్

**సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి**



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పెన్ సత్తా, మార్చి 20** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం శుక్రవారం రోజు డిప్యూటి సిఎం చేత ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ ప్రజలను మోసగించే, ప్రజా వ్యతిరేకమైన బడ్జెట్ అని సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి స్పష్టం చేశారు. గత 2025-26 బడ్జెట్ లో వివిధ రంగాలకు కేటాయించిన నిదులనే సక్రమంగా ఖర్చు చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు 3 లక్షల 24 వేల 234 కోట్ల రూపాయాలతో తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి పేరిట ప్రవేశపెట్టిన గొప్ప బడ్జెట్ అని గొప్పలు చేప్పుకొంటున్న ప్రభుత్వ పెద్దల మాటలు పచ్చి భూటకం అని మండిపడ్డారు. ఆదాయానికి, వ్యయానికి మద్య పెద్ద అంకెల గారడీలతో మాయ చేశారని అన్నారు. సామాన్య ప్రజలకు అర్థంకాని విధంగా అన్నివర్గాల ప్రజలు మెచ్చే బడ్జెట్ గా కనపడు తున్నప్పటికి బడాబాబుల ప్రయోజనాలకే బడ్జెట్ లో పెద్దపీట వేశారని అన్నారు. మేడారం జాతరను జరపడం, గద్దర్ పేరిట ఆవార్డులు ఇవ్వడాన్ని కూడ గొప్ప కార్యక్రమాలుగా చెప్పుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందని ఎత్తిచూపారు. ఖమ్మం వెలుగుమట్లలో పేద, మద్యతరగతి ప్రజలు భూదాన్ భూమిలో గత 8 సంవత్సరాలుగా తమ నివాసాలుగా నిర్మించుకున్న ఇండ్లను బుల్ డోజర్లతో కూల్చివేయడం, మూసి ప్రక్షాళన పేరుతో అక్కడి ప్రజలను వారి నివాసాల నుండి వేలాది కుటుంబాలను బలవంతంగా వెళ్ళగొట్టి, నిర్వాసితులుగా మార్చడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. గత రెండున్నర సంవత్సరాల కాలంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర వహించిన ఉద్యమ కారులకు ఇచ్చిన హామీల అమలు ఊసేలేదు. చట్టబద్దమైన సంక్షమ బోర్డు ప్రకటన ఉత్తుత్తి ప్రకటనగా మార్చి, ఉద్యమ సంస్థలను, అమరుల కుటుంబాలను దగా చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, గత కేసీఆర్ ప్రభుత్వం కన్న కాంగ్రెస్ ప్రభుత్వమే దారుణంగా వంచించింది పేర్కొన్నారు వికలాంగులు, వృద్దులు, మహిళలకు మొండి చెయ్యిని చూపించడమే గాక, ఆరు గ్యారంటి అమలులో పూర్తిగా వెనుకబడి పోయిందని ఎత్తిచూపారు. అప్పులతో రాష్ట్రాన్ని దివాళాతీయించి, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపని బడ్జెట్ వలన తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. రాబోయే సంవవత్సరంలో ప్రభుత్వం, తీవ్ర ఆర్థిక, రాజకీయ సంక్షోభానికి గురై, అర్థకాలి, పస్తులు, నిరుద్యోగం, డిజీల్, పెట్రోల్, నిత్యవసర ధరలు లాంటి సమస్యలతో ప్రజలు అప్పులకు, వలసలకకు కారణమై, ఆత్మహత్యలకు గురై ప్రమాదం ఉందని షేక్ షావలి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఇలాంటి అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక బడ్జెట్లకు వ్యతిరేకంగా బలమైన ప్రజా ఉద్యమ నిర్మాణానికి పూనుకోవాలని షేక్ షావలి సందర్భంగా పిలుపునిచ్చారు.

# భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్.



**మూడు దశల్లో అభివృద్ధి పనులు.**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, మార్చి 20** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థాన అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు , వాకాటి శ్రీహరి అన్నారు. భద్రాద్రిని ఒక అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందని వెల్లడించారు.

భద్రాచలం ఆలయ రూపురేఖలను మార్చేలా రూపొందించిన మాస్టర్ ప్లాన్ పై శుక్రవారం నాడు సచివాలయంలోని మంత్రి కొండా సురేఖ గార కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రెండు వందల సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని ఆగమ శాస్త్రం ప్రకారం భక్తుల మనోభావాలకు అనుగుణంగా మూడు దశల్లో ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో చర్చించిన తర్వాత మాస్టర్ ప్లాన్కు తుదిరూపునివ్వాలని సమావేశంలో నిర్ణయించారు.

వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యేనాటి కి భద్రాచలంలో పుష్కర ఘాట్తో పాటు మొదటి దశ ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలాన్ని తెలంగాణలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక హబ్గా మారుస్తామన్నారు. భద్రాచలం సమీపంలోని రామవరంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గోదావరి పుష్కరాలలో భాగంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన కొరివి వీరభద్రస్వామి దేవాలయం, మల్లూరు లోని నరసింహాస్వామి దేవాలయాలను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. సమావేశంలో పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయిక్ , శాసనసభ్యులు తెల్లం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# చింతకాని లో గ్రామ సభ

- చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు




**చింతకాని పెన్ సత్తా, మార్చి 20** ప్రతినిధి :చింతకాని మండల కేంద్రం పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ ఏర్పాటు చేయడం జరిగింది . ఈ యొక్క గ్రామ సభలో పలు సమస్యలపై చర్చించడం జరిగింది . అదేవిధంగా చింతకానిలో చేపట్టబోతున్నటువంటి సిసి రోడ్లు మరియు డ్రైనేజీ వ్యవస్థ పై దృష్టి సారిస్తున్నట్లు చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు పేర్కొన్నారు. . అదేవిధంగా రాబోయే రోజుల్లో చింతకానిలో ఉన్న ప్రతి ఒక్క సమస్యను పరిష్కరిస్తామని ప్రజల నుండి పలు సమస్యలను సేకరించి ఏకగ్రీవంగా ఈ యొక్క గ్రామ సభలో తీర్మానం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోలా ఉమారాణి,చింతకాని సెక్రటరీ రమేష్ బాబు, మరియు వార్డ్ మెంబర్లు పొనుగోటి బాబు,మాతంగి నాగరాజు, వేముల ఆకాష్,కిలారు బాబురావు, గంధసిరి లలిత,షేక్ రహీమ్ తుల్లా, జలగనబోయిన కృష్ణ మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# తాను నాయక్ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శం.

- కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ గణేష్ నాయక్.
- ఇల్లందు క్రాస్రోడ్లో తాను నాయక్ విగ్రహం ఏర్పాటు చేయాలి: వీరు నాయక్.
- తాను నాయక్ 76వ వర్థంతి సందర్భంగా ఘన నివాళి.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ లక్ష్మీదేవిపల్లి పెన్ సత్తా, మార్చి 20** ,తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి పోరాడిన బంజారా తెగకు చెందిన జాటోత్ తాను నాయక్ జీవిత గాథ ప్రతీ ఒక్కరికి ఆదర్శనీయమని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ నాయక్ అన్నారు. ప్రజలను సంఘటితం చేసి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించారని గుర్తుచేశారు. తాను నాయక్ 76వ వర్థంతి సందర్భంగా బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్ ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలంలో శుక్రవారం నిర్వహించిన వర్థంతి కార్యక్రమంలో గణేష్నాయక్ పాల్గొని తాను నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణేష్ నాయక్ మాట్లాడుతూ 1948 సంవత్సరంలో హైదరాబాద్ సంస్థానంలో పోలీస్ యాక్షన్ ఏర్పాటు చేసిన సమయంలో కుల, మతాలకు అతీతంగా ప్రజలను సంఘటితం చేసి ఎదురొడ్డి నిలబడ్డారన్నారు. ధర్మపురం తండా మొండ్రాయికి చెందిన తాను నాయక్ కుటుంబంలో తండ్రి హమూనాయక్, తల్లి మంగిలి, ఐదుగురు సోదరులు సైతం తెలంగాణ స్వరాజ్యం కోసం పోరుసల్పారని గుర్తుచేశారు. తాను నాయక్తో సహా తన ఆరుగురు సోదరులు సైతం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరమరణం పొందారని చెప్పారు. నేడు దేశంలో బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల సాధనకై తాను నాయక్ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు.



**ఇల్లందు క్రాస్రోడ్లో తాను నాయక్ విగ్రహం ఏర్పాటు చేయాలి: వీరు నాయక్, జేఏసీ వైస్ చైర్మన్**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరమరణం పొందిన బంజారా బిడ్డ జాటోత్ తాను నాయక్ విగ్రహాన్ని లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఇల్లందు క్రాస్రోడ్ సెంటర్లో ఏర్పాటు చేయాలని జేఏసీ వైస్ చైర్మన్ వీరు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొలిసారిగా ఇల్లందు క్రాస్రోడ్ వద్ద తాను నాయక్ వర్థంతి నిర్వహించినట్లు చెప్పారు. ఆయన పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ బంజారా హక్కులను సాధిస్తామని, అందుకోసం బంజారాలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు అజ్మీరా లైలా, గుగులోత్ ప్రేమిందర్, హాతీరాం, కార్పొరేటర్ సింధు తపస్వి, జేఏసీ గౌరవాధ్యక్షులు రమేష్ రాథోడ్, బానోత్ రాములు, సాధులు గణేష్ మహరాజ్, రాములు మహరాజ్, జేఏసీ ప్రధాన కార్యదర్శులు ధరావత్ కన్షీరామ్, మూడ్ జయరాం, కో--కన్వీనర్లు మాళోత్ శివ, గుగులోత్ చందర్ నాయక్, గుగులోత్ భద్రు, నూనావత్ రవి, బాబులాల్ నాయక్ , బాలకృష్ణ,భరత్, నర్సింహా, హనుమంతు, సేవ్యా, బానోత్ ప్రసాద్, శ్రీను, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య రాంబాబు, మహిళా కో--కన్వీనర్ జానకి బాయి, రమేష్, బాలు, కిషన్, హరిలాల్ బానోత్ ప్రతాప్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధికి వారధులు

- ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పెన్ సత్తా, మార్చి 20** ఉప్పల్ నియోజకవర్గం కమలానగర్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఈరోజు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పరమేశ్వర్ రెడ్డి గారికి పుష్పగుచ్ఛం అందజేసి తమను పరిచయం చేసుకున్నారు.

కాలనీ అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారం కోసం అసోసియేషన్ తరపున పరమేశ్వర్ రెడ్డి గారికి పలు వినతులు తెలియజేశారు దీనిపై స్పందించిన పరమేశ్వర్ రెడ్డి గారు కాలనీ ప్రజల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు అలాగే నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, కాలనీ అభివృద్ధి కోసం కాలనీ వాసుల సహకారంతో ముందుకు సాగాలని పరమేశ్వర్ రెడ్డి గారు సూచించారు.ఈ కార్యక్రమంలో కమలానగర్ కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దశరథ్ గారు,ప్రధాన కార్యదర్శి నవీన్ చౌదరి గారు,కోశాధికారి వెంకటకృష్ణయ్య గారు,సంయుక్త కార్యదర్శి నమ్ము ల రమేష్ యాదవ్, ఉపాధ్యక్షులు పార్థసారథి, ముఖ్య సలహాదారులు రాజేశ్వర్, కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు సురేష్, కాలనీవాసులు మురళి పంతులు,సత్య తదితరులు పాల్గొన్నారు

# పల్లెర్ల గ్రామంలో సిసి రోడ్లు పనులను శంకుస్థాపన చేసిన మాజీ జడ్పిటిసి కొడిత్యాల నరేందర్ గుప్తా

**ఆత్మకూరు యం పెన్ సత్తా, మార్చి 20** :యాదాద్రి భువనగిర జిల్లా ఆత్మకూర్ ఎం మండలం పల్లెర్ల గ్రామంలో సిసి రోడ్ల పనులను శంకుస్థాపన చేసిన మాజీ జెడ్పిటిసి కొడిత్యాల నరేందర్ గుప్తా ఈ కార్యక్రమంలో సర్పంచ్ తండా మంజుల నరసింహ గౌడ్. యూత్ నాయకులు తండా గోపి గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వస్తుపుల ఎల్లయ్య.వార్డు మెంబర్లు లోడి మణికాంత్. పొడుగు భార్గవి సంఘపాక రజిత. కచ్చిరవేణి మమత. సంఘీ లావణ్య సుశీల తదితరులు పాల్గొన్నారు

# పశ్చిమాసియా టెన్షన్ ప్రభావం ? సెన్సెక్స్ భారీ పతనం




పశ్చిమాసియాలో మళ్లీ తీవ్రతరమవుతోన్న ఉద్రిక్తతలు భారతీయ స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్ దాడుల కారణంగా గ్లోబల్ మార్కెట్లు కుదేలవుతుండటంతో, దేశీయ సూచీలు కూడా భారీ పతనాన్ని నమోదు చేశాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచే దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఉదయం 9:29 గంటల సమయంలో సెన్సెక్స్ దాదాపు 1,500 పాయింట్లు కోల్పోయి 75,200 స్థాయికి దిగజారింది. అదే సమయంలో నిఫ్టీ కూడా 450 పాయింట్లకు పైగా పడిపోయి 23,300 మార్క్ కిందకు చేరింది. పశ్చిమాసియాలో యుద్ధ భయం పెరగడం, ముఖ్యంగా ఇరాన్ కీలక చమురు, గ్యాస్ వనరులను లక్ష్యంగా చేసుకోవడం వల్ల సరఫరా అంతరాయం కలుగుతుందనే ఆందోళనలతో బ్రెంట్ క్రూడ్ ధరలు

ఒక్కసారిగా 3 శాతం ఎగసి బ్యారెల్‌కు 111 డాలర్లను తాకాయి. ఇక విదేశీ మారకద్రవ్య మార్కెట్లో డాలర్ బలపడటంతో రూపాయి మరింత బలహీనపడింది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 92.89 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరుకుంది. రంగాల వారీగా చూస్తే చమురు ధరల పెరుగుదల కారణంగా ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, ఎన్టీపీసీ వంటి కంపెనీల షేర్లు స్వల్ప లాభాలు నమోదు చేస్తున్నాయి. మరోవైపు హెచ్‌డీఎఫ్‌సీ, లార్సెన్ అండ్ టూబ్రో, టీఎంపీవీ, శ్రీరామ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్ వంటి షేర్లు మాత్రం అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్నాయి. మొత్తానికి, యుద్ధ భయం కొనసాగుతున్నంత కాలం మార్కెట్లలో అస్థిరత కొనసాగుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.

# భారత జిడిపి అంచనాలకు కోత

పశ్చిమాసియాలో నెలకొన్న సంఘర్షణల వల్ల వచ్చే ఏడాది కాలంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ 95 స్థాయికి పడిపోవచ్చని గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మాన్ సాక్స్ తెలిపింది. మరోవైపు భారత వృద్ధి రేటు అంచనాలకు కోత పెట్టింది. ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా సంక్షయుక్తంగా కొనసాగిస్తోన్న యుద్ధోన్మాదం వల్ల నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలతో వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27లో భారత జిడిపి అంచనాలను 7 శాతం నుంచి 6.4 శాతానికి కోత పెడుతూ హెచ్చరించింది. గతంలో కంటే ఇది 50 బేసిస్ పాయింట్లు తక్కువ. మరోవైపు ద్రవ్యోల్బణ అంచనాను 30 బేసిస్ పాయింట్లు పెంచింది. కరెంట్ అకౌంట్ లోటు (సిఎడి) 2025తో పోలిస్తే ఈ ఏడాది 0.8 శాతం పాయింట్లు పెరిగి జిడిపిలో 1.2 శాతానికి చేరుకోవచ్చని అంచనా వేసింది. వచ్చే ఏడాది కాలంలో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ 95 స్థాయికి పడిపోవచ్చని ఆ సంస్థ చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ శాంతను సేన్‌గుప్తా హెచ్చరించారు. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి మూసివేత వంటి పరిస్థితుల వల్ల చమురు ధరలు బ్యారెల్‌కు 100 మార్కును తాకుతున్నాయన్నారు. ఇది భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచుతుందని ఆయన ఓ ఇంటర్వ్యూలో విశ్లేషించారు. గత 25 ఏళ్లలో ఎదురైన చమురు సంక్షోభాల కంటే ఇది భిన్నమైనదని శాంతను సేన్‌గుప్తా అభిప్రాయపడ్డారు. గతంలో చమురు ధరలు పెరిగినప్పుడు మధ్యప్రాచ్య దేశాల ఆదాయం పెరిగి.. తద్వారా భారత్‌కు ఎగుమతులు, రెమిటెన్స్‌ల రూపంలో మేలు జరిగేదన్నారు.

కానీ.. ప్రస్తుత యుద్ధం నేరుగా ఆ ప్రాంతంలోనే జరుగుతుండటంతో అటు ఇంధన ధరల భారం పెరగడమే కాకుండా ఇటు మధ్యప్రాచ్య దేశాల ఆర్థిక వ్యవస్థలు కూడా దెబ్బతింటాయన్నారు. దీనివల్ల భారత్‌కు అందే ఎగుమతుల ఆర్డర్లు, నిధుల ప్రవాహం కూడా తగ్గిపోవడంతో దేశ ఆర్థిక వ్యవస్థకు రెండు వైపులా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన స్పష్టం చేశారు.

# ప్రపంచ ఆర్థిక మాంద్యం ముప్పు




పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ సంక్షోభం ప్రపంచ ఆర్థిక మాంద్యానికి దారి తీయనుందని యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్, యాక్సిస్ కాపిటల్ గ్లోబల్ రీసెర్చ్ హెడ్ నీలకంఠ మిశ్రా హెచ్చరించారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కొనసాగిస్తోన్న ఉద్రిక్తతలు వచ్చే నాలుగు వారాల పాటు ఇలాగే కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచ ఇంధన సరఫరాలో దాదాపు 7 శాతం మేర అంతరాయం ఏర్పడిందని వెల్లడించారు. ఇది కేవలం చమురు ధరల పెరుగుదల మాత్రమే కాకుండా నేరుగా ఇంధన కొరతకు దారితీస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన సరఫరాలో 4 శాతం నుండి 5 శాతం మేర అంతరాయం కలిగితేనే ప్రపంచ జిడిపిలోనూ 4 నుంచి 5 శాతం కోత పడే అవకాశం ఉందన్నారు.ప్రస్తుతానికి కంపెనీల వద్ద ఉన్న నిల్వలకారణంగా అంతర్జాతీయ మార్కెట్లు కొంత స్థిరంగా ఉన్నప్పటికీ సరఫరా గొలుసులో ఇబ్బందులు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని మిశ్రా పేర్కొన్నారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్, వాహన తయారీ రంగాలు కీలక ముడిసరుకుల కొరతను ఎదుర్కొంటున్నాయని ఆయన గుర్తు చేశారు. గ్యాస్ కొరతతో సూరత్ టెక్స్‌టైల్ రంగంలో ఇబ్బందులు నెలకొన్నాయన్నారు. ఇది కేవలం ఇంధనానికే పరిమితం కాకుండా మొత్తం ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపుతోందని వివరించారు. ఆర్థిక నష్టం విపరీతంగా పెరిగి అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్ల నుండి ఒత్తిడి పెరిగినప్పుడే యుద్ధంలో పాల్గొంటున్న దేశాలు వెనక్కి తగ్గే అవకాశం ఉందని మిశ్రా అభిప్రాయపడ్డారు. ఈ సంక్షోభం వల్ల కలిగే ఆర్థిక భారంతో అన్ని దేశాలు నష్టపోతాయని హెచ్చరించారు. అందుకే ఈ యుద్ధం సుదీర్ఘ కాలం కొనసాగకపోవచ్చని ఆయన అంచనా వేశారు. అయితే, కీలకమైన ఇంధన మౌలిక సదుపాయాలకు ఏదైనా నష్టం వాటిల్లితే మాత్రం పరిస్థితి మరింత దిగజారి.. జిడిపి రికవరీ ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# 8 గంటల పాటు అనిల్ అంబానీని విచారించిన సీబీఐ



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్, పారిశ్రామికవేత్త అనిల్ అంబానీపై నమోదైన రూ.2,929 కోట్ల మోసం కేసుకు సంబంధించి సీబీఐ ఆయన్ను సుమారు 8 గంటల పాటు ప్రశ్నించింది. అనిల్ అంబానీ ఉదయం 10:15 గంటలకు సీబీఐ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. లాంఛనాలు పూర్తి చేసిన అనంతరం ఆయన్ను విచారణ బృందం వద్దకు తీసుకెళ్లారు. సాయంత్రం 6:15 గంటల సమయంలో ఆయన సీబీఐ కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. ఇప్పటికే పలు కేసుల్లో సీబీఐ విచారణను ఎదుర్కొంటున్న అనిల్‌ను శుక్రవారం మరోసారి విచారణ నిమిత్తం పిలిచినట్లు అధికారులు తెలిపారు. 'రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్,

అనిల్ అంబానీ, గుర్తు తెలియని ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఇతరులు నిందితులుగా ఉన్న రూ.2,929.05


కోట్ల బ్యాంకు మోసం కేసులో.. 2025 ఆగస్టు 21న కేసు నమోదైంది. దీనికి సంబంధించి దిల్లీలోని ప్రధాన కార్యాలయంలో విచారణ నిమిత్తం హాజరు కావాలని అనిల్‌కు సమన్లు జారీ చేశాం. ఆయన్ను సుమారు 8 గంటల పాటు విచారించాం. శుక్రవారం మరోసారి విచారణకు హాజరు రావాలని ఆదేశించామ'ని సీబీఐ అధికారులు తెలిపారు.

## హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో విభేదాలు..!




దేశంలోనే అతిపెద్ద ప్రయివేటు రంగ బ్యాంక్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మేనేజ్‌మెంట్‌లో విభేదాలు తలెత్తాయి. ఆ బ్యాంక్ చైర్మన్ అతాన్ చక్రవర్తి ఆకస్మిక రాజీనామాకు మేనేజ్‌మెంట్‌తో ఉన్న విభేదాలే కారణమని తెలుస్తోంది. తన రాజీనామా లేఖలో ఆయన విలువలు, నైతికత విషయంలో గత రెండేళ్లుగా బ్యాంకులో జరుగుతున్న కొన్ని పరిణామాలు ఆందోళన కలిగిస్తోన్నాయని బాంబ్ పేల్చారు. పలు సంఘటలను, ధోరణులను అంగీకరించలేకపోతున్నానని చక్రవర్తి పేర్కొన్నారు. ఇది బ్యాంకింగ్, స్టాక్ మార్కెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో బ్యాంకులో గవర్నెన్స్ సమస్యలు ఉన్నాయనే ఆందోళనతో ఇన్వెస్టర్లు భారీగా షేర్లను విక్రయించారు. ఇంట్రాడేలో ఆ బ్యాంక్ షేర్ 9 శాతం మేర క్షీణించింది. దీంతో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మార్కెట్ కాపిటలైజేషన్ లక్ష కోట్లు పైగా తుడుచుకుపెట్టుకుపోయింది. తుదకు బిఎస్ఇలో 5.13 శాతం పతనంతో రూ.799.70కు పడిపోయింది. ఇంట్రాడేలో రూ.772 కనిష్ట స్థాయిని తాకింది. ఇది 52 వారాల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. బ్యాంకులో ఎటువంటి అధికార పోరాటాలు లేవని తాత్కాలిక ఛైర్మన్ కెకె మిస్త్రీ పేర్కొన్నారు. చైర్మన్, మేనేజ్‌మెంట్ మధ్య వ్యక్తిగత సంబంధాల పరంగా వచ్చిన ఇబ్బందుల వల్లే ఈ రాజీనామా జరిగి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. దీనికి బ్యాంకు పనితీరుతో సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. కాగా.. ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ మాక్వారీ గవర్నెన్స్ ఆందోళనల దృష్ట్యా తన 'మర్క్యూ బై లిస్ట్' నుండి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకును తొలగించడం గమనార్హం. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆర్థిక స్థితిగతులు పటిష్టంగా ఉన్నాయని ఆర్‌బిఐ పేర్కొంది. గవర్నెన్స్ పరంగా ప్రస్తుతానికి ఎటువంటి ఆందోళనకరమైన అంశాలు తమ రికార్డుల్లో లేవని తెలిపింది.

## పెరిగిన చమురు ధరలు




ఇరాన్ సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయిల్ దాడి చేసిన అనంతరం ప్రతీకారంగా ఇరాన్ మధ్యప్రాచ్యంలోని ఇంధన సదుపాయాలపై దాడి చేయడంతో చమురు ధరలు పెరిగిపోయాయి. బ్యారెల్‌కు 119 డాలర్లు దాటాయి. బ్రెంట్ ఫ్యూచర్స్ 6.02 డాలర్లు లేదా 5.6 శాతం పెరిగి బ్యారెల్‌కు 113.40 డాలర్ల వద్ద ఉంది. సెషన్ ప్రారంభంలో, బ్రెంట్ 11 డాలర్ల కంటే ఎక్కువ పెరిగి 119.13 డాలర్ల గరిష్ట స్థాయికి చేరుకుంది, ఇది మార్చి 9న తాకిన మూడున్నర సంవత్సరాల గరిష్ట స్థాయికి దగ్గరగా ఉంది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ 7 సెంట్లు లేదా 0.1 శాతం పెరిగి బ్యారెల్‌కు 96.39 డాలర్ల వద్ద ఉంది, అంతకుముందు దాదాపు 4 డాలర్లు పెరిగి 100.02 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. అలాగే మధ్యప్రాచ్య బెంచ్‌మార్క్ దుబారు, ఒమన్ ప్రీమియంలు ట్రేడ్ వర్గాలు బ్యారెల్‌కు సుమారు 65 డాలర్ల వద్ద ఆల్-టైమ్ గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. అమెరికా సెంట్రల్ బ్యాంక్ బుధవారం వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచామని ప్రకటించింది.

## టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌కు బ్రిటిష్ ప్రభుత్వ నైట్‌హుడ్ పురస్కారం



భారత్-యూకే వ్యాపార సంబంధాలను బలోపేతం చేయడంలో విశేష కృషి చేస్తున్న టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌కు బ్రిటిష్ ప్రభుత్వం గౌరవ నైట్‌హుడ్‌ను ప్రదానం చేసింది. బుధవారం రాత్రి దిల్లీలోని బ్రిటిష్ హైకమిషనర్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు 'నైట్ కమాండర్ ఆఫ్ ది మోస్ట్ ఎక్సెలెంట్ ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ (కేబీఈ)' పురస్కారాన్ని ప్రదానం చేశారు. 'యూకేలో టాటా గ్రూప్ దీర్ఘకాలంగా పెట్టుబడులు పెడుతోంది. దీని కార్యకలాపాలు వాహన, ఉక్కు, సాంకేతికత, వినియోగదారు రంగాల్లో విస్తరించి ఉన్నాయి. ఇది యూకేలో ఉద్యోగాలకు, అధునాతన తయారీ రంగానికి, స్వచ్ఛమైన సాంకేతికతల వైపు పరివర్తనకు మద్దతు ఇవ్వడంలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. టాటా గ్రూప్ ఛైర్మన్‌గా, ఆయన అనేక సంవత్సరాలుగా యూకే-భారత వ్యాపార సంబంధాలకు, బ్రిటన్‌లో పెట్టుబడులకు విశేష కృషి చేశార'ని హైకమిషన్ తెలిపింది.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## ఉచితాలు అవసరమా, అనివార్యమా?

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రభుత్వాలు బాధ్యతారాహిత్యంగా ఉచితాలు ప్రకటించడంపట్ల దేశ అత్యున్నత న్యాయస్థానం ఇటీవల రాష్ట్రాలను తీవ్రంగా హెచ్చరించింది. అటువంటి నిర్ణయాలు ప్రకటించే సమయాన్ని, ఆర్థిక తర్కాన్ని ప్రశ్నించింది. అవసరమైనవన్నీ ఉచితంగా ఇచ్చుకుంటూ పోతే ప్రజలు ఎందుకు పనిచేయాలి? అన్ని ఉచితంగా వస్తుంటే వాళ్ళు పనిచేయడం ఎక్కడి నుంచి నేర్చుకుంటారు? ఎన్నాళ్లీ ఉచితాల అమలు? ఇదేనా మనం చేసే జాతి నిర్మాణం? రాష్ట్ర ప్రభుత్వాలన్నీ దాదాపుగా రెవెన్యూ లోటు లోనే ఉన్నా, ఈ పథకాల అమలుకు డబ్బు ఎక్కడి నుంచి తెస్తున్నాయంటూ సుప్రీం ధర్మాసనం తమిళనాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేంద్రం కొత్తగా ప్రతిపాదించిన విద్యుత్ సవరణ నిబంధనలు 2024 లోని రూల్ 23ను సవాలు చేస్తూ తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు.

తమిళనాడు రాష్ట్రానికి సంబంధించిన ఈ కేసులో సుప్రీం కోర్టు దాదాపుగా దేశంలోని అన్ని రాష్ట్రాలను హెచ్చరించినట్లేనని స్పష్టం అవుతుంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఈ కేసును ఉద్ఘాటిస్తూ.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం మంచిదే. కానీ దానికి మూల్యం ఎవరు చెల్లించాలి? ఈ పథకాల అమలు కోసం ప్రభుత్వానికి డబ్బు ఎక్కడి నుండి వస్తుంది. అదంతా పన్ను చెల్లింపుదారులదే కదా? అంటూ అన్ని రాష్ట్రాలకు చురకలంటిచ్చినట్లు చీఫ్ జస్టిస్ వ్యాఖ్యలు ఉన్నాయి. ప్రస్తుతం రాజకీయ పార్టీల మేనిఫెస్టోపై చర్చ అనవసరం. సంక్షేమం, ఉచితాలు రెండు విభిన్న దృక్పథాలు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం ప్రభుత్వాల బాధ్యత. కానీ, రాజకీయ పార్టీలు సంక్షేమం ముసుగులో ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని ప్రజలను ప్రసన్నం చేసుకోవడానికి ఉచితాలు ప్రకటిస్తున్నాయి. అధికారమే లక్ష్యంగా అందలం ఎక్కేందుకు తొలుత తమ తలతాకట్టు పెట్టైనా హామీలను మీ గడపలకు చేరుస్తామని ప్రగల్భాలు పలికి అనంతరం ఆశతో అధికారమిచ్చిన ప్రజల తలపైనే చేతులు పెడుతున్న తీరును నేటి ప్రభుత్వాల్లో గమనిస్తున్నాం. ఒక నిర్దిష్టమైన ఆర్థిక విధానం అంటూ లేకుండా, అయితే అప్పులు చేస్తూ, లేకపోతే ధరలు పెంచుతూ ప్రజలను నయవంచనకు గురి చేస్తున్నాయి.

ఉచితాల అంశాన్ని తెర మీదికి రావడానికి కారణమైన తమిళనాడు రాష్ట్రంలో ఇటీవల 100 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని యోచిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సవరణ నిబంధనలు–2024 లోని నిబంధన 23 మేరకు ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో తమిళనాడు విద్యుత్ పంపిణీ కార్పొరేషన్ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో సుప్రీం కోర్టు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రస్తావిస్తూ.. నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని, ఈ భారం ప్రభుత్వం స్వీకరించడం ఎంత వరకు ప్రజా ప్రయోజనం, విద్యుత్ బిల్లు చెల్లించే శక్తి ఉన్నవారికి, లేనివారికి మధ్య ప్రామాణికం ఏంటి? సంక్షేమ రాజ్యంగా అణగారిన వర్గాలు, అవసరమైన వారికి సాయం చేయడాన్ని ఎవరైనా అంగీకరించాల్సిందే. దాన్ని సమాజం కూడా అదే రీతిలో స్వాగతించాలి. కానీ కొందరు వ్యక్తులు అన్ని ఉండి కూడా తమ పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వం అమలుచేసే పథకాలు, ఉచితాలు తమ జేబుకే చేరాలనుకునేవారు సమాజంలో అనేక మంది ఉండడమే ఆందోళన కలిగించే విషయం. తెలంగాణ రాష్ట్రంలో కూడా 200 వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నరు. రాష్ట్రంలోని కొన్ని లక్షల కుటుంబాలకు ఉపశమనం కలిగించే విషయమే. ప్రభుత్వం బాధ్యతగా భరోసాను కల్పించే పథకమే ప్రవేశపెట్టింది. కానీ ఏ స్థాయిలో ఈ పథకం ఉపయోగపడుతుందో అదే స్థాయిలో బిల్లు కట్టే స్థోమత ఉన్నవారికి కూడా అందించడం అసలు పథకం సార్ధకతను ప్రశ్నించే విధంగా ఉందన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని సుప్రీం కోర్టు స్పష్టం చేస్తోంది. వాస్తవానికి ఉచిత పథకాలు సమాజానికి ప్రమాదమే. ఎప్పుడు ప్రమాదం అంటే అన్నీ ఉన్నవారికి కూడా ఇచ్చినప్పుడు, కడుపునిండా తినే స్థోమత ఉన్నవాడికి ఇచ్చినప్పుడు, ఈ ఉచితాలు తప్పక నిరుపయోగమే. కానీ బొక్కలుతేలి ఆకలిని అలవాటుగా మార్చుకుని తన దైనందిన జీవితాన్ని తప్పక కొనసాగిస్తున్న పేదవానికి ఉచితం అందితే అది తప్పక అమృతం అవుతుందే కానీ విషం కాదు. మన తెలంగాణ రైతాంగం అంటేనే రాష్ట్రం ఏర్పడే నాటికి ఒక రకమైన అభిప్రాయం అప్పుల ఊబిలు, ఉరికొయ్యలు, పురుగుల మందు డబ్బాలు, –బీడు భూములు, కరెంటు కోతలు, అడుగంటిన బోరుబావులు ఇది ఒక్క మాటలో చెప్పాలంటే మన రైతుల సమగ్ర స్వరూపం. ఏదిఏమైనా రాష్ట్రం ఏర్పడ్డాక పెట్టుబడికి రైతుబంధు డబ్బులు మాత్రం ఒక గొప్ప ధీమాను కల్పించాయని చెప్పడానికి ఒక్కటా రెండా అనేక జీవితాలు నిలువెత్తు నిదర్శనంగా నిలబడి ఉన్నాయి.

ఈ పథకం సైతం అమలు విషయంలో దుర్వినియోగం అయింది. ఇప్పటివరకు రైతులకు నష్టం కంటే లాభం ఎక్కువగా చేసిన పథకం ఏదైనా ఉంది అంటే అది ఇదే. రాష్ట్రంలో లక్షలాది మంది వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఆసరా పింఛన్ల పథకంతో ప్రతి నెల ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చకపోయినా ఆయా వర్గాలను ఆత్మవిశ్వాసంతో బతకడానికి అవసరమైన ధీమాను ఈ పథకం కల్పించింది. రాజ్యం ఇదొక మానవీయ పథకంగా భావించాలే తప్ప ఉచితంగా పరిగణించవద్దు. పెద్దపెద్ద పారిశ్రామిక కుటుంబాలకు వేలకోట్ల రూపాయల రుణాలను రైట్ ఆఫ్ చేసిన దేశ పాలకులు సైతం ఉచిత పథకాలను విమర్శిస్తున్నారు. తమకు అందని ఉచిత పథకం ఏదైనా వృథానే అనిపించడం మామూలే. అతి ఎప్పుడైనా కొంపకు చేటే అన్నట్లు అనవసరమైన ఉచితం వ్యవస్థ ఉనికికే ముప్పు. ఈ సందర్భంగా మనందరం గుండెల మీద చేయి వేసుకుని ఆలోచించాల్సిన ఒక విషయం ఏంటంటే ఉచిత హామీల అమలు కోసం ఎంత మొత్తంలో ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి. అందుకు నిధుల సమీకరణ ఎలా జరుగుతుంది అన్న ప్రశ్నలు సంధించుకుని మనకు మనమే సమాధానం చెప్పుకుంటే తప్ప మనకు మనం తెలుసుకోలేం. అర్థం కాదు కూడా ఈ ఉచితాల ముసుగు. సుప్రీం తీర్పు నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని, ఉచితాలతో ప్రజలను భ్రమల్లోకి నెట్టకుండా, వారి జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకువచ్చే దిశగా ప్రణాళికలు రూపొందించాలి.

# మినప సున్నుండలు.. ఉక్కులాంటి బలం.. ఆరోగ్యానికి ఆరోగ్యం



మినప సున్నుండలు శారీరక బలానికి, సంపూర్ణ ఆరోగ్యానికి తోడ్పడే అద్భుతమైన సాంప్రదాయ వంటకం. నల్ల మినుములను, బెల్లం, నెయ్యి ఉపయోగించి తయారుచేసే ఈ సున్నుండలు పిల్లల ఎదుగుదలకు, పెద్దలకు శక్తిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రుచికరమైన, ఆరోగ్యకరమైన ఈ సున్నుండలను సులభంగా తయారుచేసుకోవచ్చు..మినప సున్నుండలు.. నల్ల మినుములతో తయారుచేసే బలవర్ధకమైన, ఆరోగ్యకరమైన సాంప్రదాయ పిండి వంటకం.. ఇవి రుచికరంగా ఉండటమే కాకుండా, శారీరక శక్తిని, ఆరోగ్యాన్ని పెంపొందించడంలో గొప్పగా సహాయపడతాయి. ముఖ్యంగా పిల్లలకు బలాన్నిచ్చి, పెద్దలలో నడుము నొప్పి, కాళ్ళ నొప్పులు, నీరసం వంటి సమస్యలను తగ్గించడానికి సున్నుండలు చాలా ఉపయోగపడతాయి. మినప లడ్డులో ప్రోటీన్, ఐరన్, కాల్షియం, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఈ ఆరోగ్యకరమైన సాంప్రదాయ లడ్డూల్లో.. మినపప్పు, బెల్లం, నెయ్యి ఉండటం వల్ల, ఇవి ఎముకల బలానికి, జీర్ణక్రియకు, చిన్న పిల్లల ఎదుగుదలకు, నడుము నొప్పి తగ్గడానికి చాలా మంచిది. ఇవి యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి.. ఇవి తక్షణ శక్తిని అందివ్వడంతోపాటు.. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ మినపలడ్డు బాలింతలకు నడుము నొప్పి తగ్గించి, బలాన్ని ఇస్తుంది. పిల్లల ఎదుగుదలకు, జ్ఞాపకశక్తికి మంచిది. అంతేకాకుండా.. గుండె ఆరోగ్యానికి సహాయపడుతుంది. అంతేకాకుండా.. కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుతుంది. ఎముకల బలానికి సహాయపడుతుంది. బెల్లం సున్నండలు తీసుకోవడం వల్ల రక్త హీనత సమస్య కూడా దూరమవుతుంది.

మినప సున్నుండల తయారీ ఇలా..


సున్నుండలు తయారుచేయడానికి నల్ల మినుములను మాత్రమే ఉపయోగించడం మంచిది. సుమారు ఒకటిన్నర కిలోల నల్ల మినుములను తీసుకుని, వాటిని ఒకేసారి లేదా కొన్ని కొన్ని భాగాలుగా విడదీసి వేయించుకోవాలి. స్టవ్ ను సిమ్ లో లేదా మీడియం ఫ్లేమ్ లో పెట్టి ఐదు నుండి పది నిమిషాల పాటు వేయించుకోవాలి. మినుములు మంచి సువాసన వచ్చి, రంగు మారిన తర్వాత ఒక గిన్నెలోకి తీసుకుని చల్లార్చాలి. ఈ విధంగా మిగిలిన మినుములను కూడా వేయించుకోవాలి. ఇలా వేయించడం వల్ల సున్నుండలు రుచికరంగా ఉండటంతో పాటు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. వేయించిన మినుములను మర పట్టి లేదా మిక్సీలో మెత్తటి పొడిగా చేసుకోవాలి. అదే విధంగా, ఒకటిన్నర కిలోల బెల్లంను కూడా తీసుకుని.. పాకం తయారు చేసుకోవాలి. తురిమిన బెల్లం, నెయ్యి కలిపి ఈ లడ్డూలు తయారు చేసుకోవాలి.. పాకం లేదా బెల్లం, మినప పొడిని పొడిని ఒక పెద్ద పాత్రలో వేసి, ఉండలు లేకుండా చేత్తో లేదా గరిటెతో బాగా కలపాలి. ఇది సున్నుండల తయారీలో ముఖ్యమైన దశ, ఎందుకంటే పొడులు సమానంగా కలవకపోతే ఒక దగ్గర తీపి ఎక్కువగా, ఇంకో దగ్గర తక్కువగా ఉండవచ్చు. పొడులు బాగా కలిపిన తర్వాత, కొద్దికొద్దిగా వేడి చేసిన నెయ్యిని కలుపుతూ సున్నుండలను చుట్టుకోవాలి. నెయ్యి వేడిగా ఉంటే ఉండలు చక్కగా వస్తాయి. నెయ్యి కూడా తక్కువ పడుతుంది. మీకు నచ్చిన పరిమాణంలో సున్నుండలను తయారు చేసుకోవచ్చు. కావాలనుకుంటే, సువాసన కోసం యాలకుల పొడిని కూడా కలుపుకోవచ్చు.. అయితే కలపకపోయినా రుచి బాగుంటుంది. ఇలా తయారుచేసిన సున్నుండలను నిల్వ ఉంచుకుని, రోజుకు ఒకటి లేదా రెండు తినడం ద్వారా శారీరక బలాన్ని పొందవచ్చు.

# సమ్మర్‌లో బాడీని కూల్‌గా ఉంచే పండ్లు!



వేసవిలో శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండాలంటే ప్రకృతి సిద్ధమైన పండ్లను మించిన ఆహారం లేదు. ఇవి మనకు తక్షణ శక్తిని ఇవ్వడమే కాకుండా, చర్మాన్ని మెరిసేలా చేస్తాయి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వేసవి కాలం వచ్చిందంటే చాలు, భానుడి భగభగలకు శరీరం విలవిలలాడుతుంది. కేవలం చల్లని నీళ్లు తాగడం లేదా ఏసీ గదుల్లో ఉండటం వల్ల మాత్రమే శరీరానికి ఉపశమనం లభించదు. ఎండలు పెరిగే కొద్దీ మన శరీరానికి నీటి అవసరం కూడా పెరుగుతుంది. ప్రకృతి ప్రసాదించిన కొన్ని రకాల పండ్లు మనల్ని కేవలం చల్లబరచడమే కాకుండా, శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లు, విటమిన్లు, ఖనిజాలను అందిస్తాయి. పుచ్చకాయ: వేసవి అంటేనే పుచ్చకాయ! ఇందులో 90 శాతం కంటే ఎక్కువ నీరు ఉంటుంది. దాహాన్ని తీర్చడంతో పాటు విటమిన్ ఎ, సి, లైకోపీన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఇది గుండె ఆరోగ్యానికి, చర్మ రక్షణకు ఎంతో మేలు చేస్తుంది. ముక్కలుగా కోసుకుని లేదా పుదీనాతో కలిపి జ్యూస్‌లా తీసుకుంటే చాలా బాగుంటుంది.కర్బూజా: దీనిని కాంటాలోప్ అని కూడా పిలుస్తారు. ఇందులో నీటి శాతంతో పాటు ఎలక్ట్రోలైట్లు ఎక్కువగా ఉంటాయి, ఇవి ఎండలో మన శక్తి తగ్గకుండా చూస్తాయి. పొటాషియం, విటమిన్ సి పుష్కలంగా ఉండే ఈ పండును స్మూతీలలో కూడా వాడుకోవచ్చు. మామిడి పండు: పండ్లలో రాజు అయిన మామిడి పండు కేవలం రుచికే కాదు, హైడ్రేషన్ కోసం కూడా ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్, విటమిన్ సి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. మిల్క్ షేక్స్ కంటే కూడా పండును నేరుగా తినడం వల్ల ఎక్కువ పోషకాలు అందుతాయి. అనాస పండు: పైనాపిల్‌లో నీటి శాతంతో పాటు 'బ్రోమెలైన్' అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది మంటను తగ్గించడానికి, జీర్ణక్రియకు సహాయపడుతుంది. మధ్యాహ్నం స్నాక్స్‌లా తీసుకుంటే ఇది చాలా రిఫ్రెషింగ్‌గా ఉంటుంది.బొప్పాయి: బొప్పాయిలో నీరు, విటమిన్ ఏ, సి, ఈ సమృద్ధిగా ఉంటాయి. ఇందులో ఉండే 'పాపైన్' అనే ఎంజైమ్ వేసవిలో వచ్చే జీర్ణ సమస్యలను దూరం చేస్తుంది. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో దీనిని తీసుకోవడం ఉత్తమం. స్ట్రాబెర్రీలు: వీటిలో నీటి శాతం, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఇవి ఎంతగానో దోహదపడతాయి. వీటిని పెరుగు లేదా సలాడ్లలో కలిపి తీసుకోవచ్చు. నారింజ: నారింజ పండ్లు మన శరీరానికి అవసరమైన విటమిన్ సి, పొటాషియంను అందిస్తాయి. ఇవి శరీరంలోని నీటి నిల్వలను సమతుల్యం చేస్తాయి. రసం తీయడం కంటే తొనల రూపంలో తింటే పీచు పదార్థం కూడా శరీరానికి అందుతుంది. వేసవిని ఆరోగ్యంగా ఎదుర్కోవాలంటే కేవలం కృత్రిమ పానీయాల మీద ఆధారపడకుండా, ఇలాంటి ప్రకృతి సిద్ధమైన పండ్లను మీ రోజువారీ ఆహారంలో భాగం చేసుకోండి. ఇవి మిమ్మల్ని లోపలి నుంచి చల్లబరిచి, ఉత్సాహంగా ఉంచుతాయి.

# 40 ఏళ్లు దాటిన మహిళల్లో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా?



మహిళల ఆరోగ్యం విషయంలో 40 ఏళ్లు అనేది ఒక కీలకమైన మలుపు. ఈ సమయంలో శరీరానికి తగినన్ని పోషకాలు అందకపోతే అది రక్తహీనతకు దారితీస్తుంది. రయన్ ఫెర్నాండో ప్రకారం, ఐరన్, ఫోలేట్, విటమిన్ బి12 అనేవి ఒక జట్టుగా పనిచేస్తాయి. వీటిలో ఏ ఒక్కటి తగ్గినా మిగిలినవి సరిగ్గా పనిచేయవు. వయసు పెరుగుతున్న కొద్దీ మన శరీరంలో అనేక మార్పులు సంభవిస్తుంటాయి. ముఖ్యంగా 40 ఏళ్లు దాటిన మహిళల్లో తరచుగా నీరసం, ఎముకల నొప్పులు, అకస్మాత్తుగా లేచి నిలబడినప్పుడు కళ్లు తిరగడం లేదా కళ్ల ముందు నల్లటి చుక్కలు కనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలామంది వీటిని కేవలం అలసటగా భావించి నిర్లక్ష్యం చేస్తారు. కానీ, ఇవి శరీరంలో పోషకాల లోపానికి సంకేతాలు కావచ్చని ప్రముఖ ఒలింపిక్ స్పోర్ట్స్ న్యూట్రిషనిస్ట్ రయన్ ఫెర్నాండో హెచ్చరిస్తున్నారు. అనుష్క శర్మ వంటి తారలకు డైట్ ప్లాన్ రూపొందించిన ఫెర్నాండో, 40 దాటిన మహిళలకు అవసరమైన కీలక పోషకాల గురించి ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు.ఐరన్– శరీరంలోని ఎర్ర రక్త కణాలు ఆక్సిజన్‌ను అన్ని భాగాలకు చేరవేయడానికి ఐరన్ చాలా అవసరం. ఐరన్ లోపిస్తే రక్తహీనత ఏర్పడి విపరీతమైన నీరసం, బలహీనత కలుగుతాయి. రోజుకు 18 మి.గ్రా ఐరన్ తీసుకోవాలి. బచ్చలికూర, గుప్పెడు డ్రై ఫ్రూట్స్, ఆర్గాన్ మీట్స్ ద్వారా దీనిని పొందవచ్చు.ఫోలేట్– ఫోలేట్ లేకపోతే శరీరం ఆరోగ్యకరమైన ఎర్ర రక్త కణాలను తయారు చేయలేదు, ఐరన్‌ను సరిగ్గా గ్రహించలేదు. రోజుకు 400 మి.గ్రా ఫోలేట్ అవసరం. ఒక బీట్‌రూట్, ఒక నారింజ పండు లేదా ఒక కప్పు ఉడికించిన బ్రోకలీని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా ఈ లోపాన్ని అధిగమించవచ్చు. విటమిన్ బి12– మెదడు, నరాల ఆరోగ్యాన్ని కాపాడటంలో, అలాగే డీఎన్ఏ తయారీలో బి12 కీలక పాత్ర పోషిస్తుంది. ఇది శరీరంలో ఫోలేట్ సరిగ్గా ఉపయోగపడటానికి సహాయపడుతుంది. బి12 లోపిస్తే గుండె జబ్బులు, స్ట్రోక్ మరియు ఎముకల బలహీనత వచ్చే ప్రమాదం ఉంది. రోజుకు 2.6 మైక్రో గ్రాములు. పాలు, చేపలు లేదా ఫోర్టిఫైడ్ ఆహార పదార్థాల ద్వారా బి12 లభిస్తుంది. ఫోలేట్, విటమిన్ బి12 రెండూ ఒకేచోట లభించే అద్భుతమైన ఆహారం గుడ్డు. రోజుకు కేవలం రెండు గుడ్లు తినడం వల్ల ఈ పోషకాల లోపాన్ని సులభంగా భర్తీ చేయవచ్చని న్యూట్రిషనిస్ట్ సూచిస్తున్నారు. వయసుతో పాటు వచ్చే శారీరక మార్పులను గమనిస్తూ, తగిన ఆహారపు అలవాట్లను మార్చుకోవడం చాలా ముఖ్యం.

# కోహ్లీ, రోహిత్, సంజు కాదు.. ఈసారి ఆరెంజ్ క్యాప్ విన్నర్ ఇతనే!




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్ 2026) 19వ సీజన్ మరో వారం రోజుల్లో పారంభం కానుంది. మార్చి 28వ తేదీన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌తో ఈ సీజన్ స్టార్ట్ కానుంది. ఐపీఎల్ లీగ్ ద్వారా అనేక మంది ప్లేయర్స్ అంతర్జాతీయ స్థాయిలో తమకంటూ ఓ ప్రత్యేకమైన పేరును సంపాదించుకుంటారు. ఇకపోతే ఈ టోర్నమెంట్ హిస్టరీలో అత్యధిక రన్స్ చేసిన ఆటగాడికి "ఆరెంజ్ క్యాప్" దక్కుతుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, క్రిస్ గేల్ లాంటి స్టార్ బ్యాటర్లు భారీగా పరుగులు చేసినప్పటికీ.. ఈ అవార్డును అత్యధికసార్లు గెలిచిన ప్లేయర్ మాత్రం ఆస్ట్రేలియాకు చెందిన డేవిడ్ వార్నర్.

కాగా 2016లో విరాట్ కోహ్లీ 973 పరుగులతో ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్ గా రికార్డు సృష్టించాడు. ఈ రికార్డు ఇప్పటికీ వరకు ఎవరూ కనీసం టచ్ కూడా చేయలేకపోయారు. అలాగే, డేవిడ్ వార్నర్ అత్యధికంగా మూడు సార్లు ఆరెంజ్ క్యాప్ గెలిచిన ఏకైక ఆటగాడిగా నిలిచాడు. దీంతో త్వరలోనే ప్రారంభమయ్యే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో ఆరెంజ్ క్యాప్ రేసులో టీ20 వరల్డ్ కప్ లో చెలరేగిన ఇషాన్ కిసన్, సంజు శాంసన్, సూర్యకుమార్ యాదవ్, ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్ బరిలో ఉన్నారు. చూడాలి మరీ 2026 ఆరెంజ్ క్యాప్ ఎవరినీ వరిస్తోందో అనేది.

# చెన్నై సూపర్ కింగ్స్‌కి బిగ్ షాక్.. మోకాలి గాయంతో ఎంఎస్ ధోనీ ఇబ్బంది



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 ప్రారంభానికి ఇంకా కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఇప్పటికే అన్ని జట్లు సన్నాహాలు మొదలుపెట్టాయి. మార్చి 28వ తేదీన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌తో ఈ సీజన్ ప్రారంభం కానుంది. క్రికెట్ అభిమానులు తమ ఇష్టమైన ఆటగాళ్లను మైదానంలో చూడాలని ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్నారు. అందులో ముఖ్యంగా మహేంద్ర సింగ్ ధోనీ కోసం భారీగా ఫ్యాన్స్ తరలిరానున్నారు. అయితే, ధోని హెల్త్ కి సంబంధించిన వార్త అభిమానులకు కొంత ఆందోళనకు గురి చేస్తుంది. ప్రాక్టీస్ సెషన్ అనంతరం ధోని కుంటుతూ నడుస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై ఫ్రాంచైజీ నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, అతని ఫిట్‌నెస్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2023 సీజన్ నుంచి ఎంఎస్ ధోని మోకాలి గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. అయినప్పటికీ ఇంకా క్రికెట్ ఆడుతూ, వికెట్ కీపింగ్ బాధ్యతలు నిర్వహించడం విశేషం. 2023లో ఐపీఎల్ ఫైనల్ కి ముందు ముంబైలో మోకాలి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఆ తర్వాత అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో గుజరాత్ టైటాన్స్ పై విజయం సాధించారు. కానీ ఈసారి ధోని కెప్టెన్‌గా ఉండడు.. ఇప్పటికే కెప్టెన్సీ బాధ్యతలు రుతురాజ్ గైక్వాడ్ కి అప్పగించారు. ఇక వికెట్ కీపింగ్ విషయంలో ధోని పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటాడా అనే సందేహం కలుగుతుంది.

**కీపింగ్ చేసేది సంజు శాంసన్?:**

ఎంఎస్ ధోని ఫిట్‌గా లేకపోతే, సంజూ శాంసన్ వికెట్ కీపర్‌గా బాధ్యతలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ట్రేడింగ్ ద్వారా చెన్నై జట్టులో చేరిన అతడు, ఇప్పటికే ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు కెప్టెన్‌గా పని చేసిన అనుభవం కలిగి ఉంది. ప్రస్తుతం సంజు అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. వెస్టిండీస్‌పై 97 నాటౌట్, ఇంగ్లాండ్‌పై సెమీఫైనల్లో 89, న్యూజిలాండ్‌పై ఫైనల్లో 89 పరుగులు చేసి జట్టును గెలిపించాడు.

**శాంసన్ కీలక వ్యాఖ్యలు:**

సంజు శాంసన్ మాట్లాడుతూ: మాహీ భాయ్‌తో ఫోన్‌లో చాలాసార్లు మాట్లాడాను.. ఇండియా క్యాంప్‌లో కూడా చూశాను.. కానీ ఒకే జట్టులో కలిసి ఆడటం ఇదే మొదటిసారి.. ఆయనతో కలిసి ఆడేందుకు చాలా ఉత్సాహంగా ఉన్నాను అని తెలిపారు. చెన్నై సూపర్ కింగ్స్ రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలో ఇంకా టైటిల్ గెలవలేదు.. ఈ సీజన్‌లో మంచి ఫలితాలు సాధించాలని జట్టు లక్ష్యంగా పెట్టుకుంది.. ధోని ఫిట్‌నెస్ పరిస్థితి ఈ జట్టు ప్రదర్శనపై ఎంత మేర ప్రభావం చూపుతుందో అనేది వేచి చూడాలి.



మృణాల్ ఠాకూర్: ప్రతి చిరునవ్వులో టైమ్‌లెస్ గ్రేస్

# హిస్టరీ రిపీట్ చేయడానికి సిద్ధమవుతున్న సౌత్ యూనివర్స్



సౌత్ ఇండియన్ సినిమా పాన్ ఇండియా మార్కెట్‌లో తన ఆధిపత్యాన్ని చాటడం మొదలుపెట్టింది బాహుబలి సినిమాతోనే. ఆ సినిమా తర్వాత ఫ్రాంచైజ్‌లపై దృష్టి మరింత పెరిగింది. ఇప్పుడు అదే ట్రాక్‌పై భారీ అంచనాలతో ముందుకు రాబోతున్న రెండు ప్రాజెక్టులు పుష్ప3 మరియు కెజిఎఫ్3.

**పాన్ ఇండియా ఫ్రాంచైజ్ రేస్**

రాకీ భాయ్ ఎలివేషన్స్‌తో KGF సిరీస్ కు దేశవ్యాప్తంగా మాస్ ఇమేజ్ విపరీతంగా వచ్చింది. కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చి నార్త్ బెల్ట్‌లోనూ భారీ మార్కెట్‌ను సొంతం చేసుకోవడం ఈ ఫ్రాంచైజ్ ప్రత్యేకత. మరోవైపు పుష్ప క్యారెక్టర్ స్టైల్, యాటిట్యూడ్, డైలాగ్స్‌తో నార్త్‌లో సెన్సేషన్ సృష్టించింది. ఈ రెండు సిరీస్‌లూ కేవలం సీక్వెల్స్‌లా మాత్రమే కాకుండా, బ్రాండ్‌లుగా ఎదిగాయి. మెర్చండైజ్, సోషల్ మీడియా ట్రెండ్స్, ఫ్యాన్ బేస్.. ఇవన్నీ కలిపి వీటిని పాన్ ఇండియా రేంజ్‌లో నిలబెట్టాయి. బాహుబలి ఫ్రాంచైజ్ తర్వాత సౌత్ నుంచి వచ్చి అంతటి హైప్, క్రేజ్ అందుకున్న ప్రాజెక్టులు ఇవే.

**బాక్సాఫీస్ ప్రెడిక్షన్**

ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్న అంచనాల ప్రకారం ఈ రెండు సినిమాలూ రిలీజ్ తర్వాత సౌత్ ఇండియన్ సినిమాల్లో అత్యంత సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజ్‌లుగా నిలవడం ఖాయమని భావిస్తున్నారు. యష్, రాకీ భాయ్‌గా స్క్రీన్‌పై కనిపించే ప్రతిసారీ థియేటర్లు షేకవుతాయనే విశ్వాసం అభిమానుల్లో ఉంది. మరోవైపు అల్లు అర్జున్ మాస్ ట్రాన్స్‌ఫర్మేషన్, యాక్షన్ స్టైల్ పుష్ప బ్రాండ్‌ను మరింత ఎత్తుకు తీసుకెళ్లింది. ఈ రెండు సినిమాలకు ఓపెనింగ్స్ విషయంలో అడ్వాన్స్ బుకింగ్స్ కీలకం కానున్నాయి. హిందీ మార్కెట్, ఓవర్సీస్ కలెక్షన్లు, పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్.. ఇవన్నీ రికార్డులను బద్దలు కొట్టే అవకాశాలను పెంచుతున్నాయి. హైప్ పరంగా చూసుకుంటే హిస్టరీ రిపీటయ్యే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**నెక్స్ట్ జనరేషన్ యూనివర్స్ ట్రెండ్**

ఈ ఫ్రాంచైజ్‌ల సక్సెస్ తో ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో సినిమాటిక్ యూనివర్స్ మోడల్‌పై చర్చలు మొదలయ్యాయి. కెజిఎఫ్ ప్రపంచాన్ని విస్తరించే ప్రయత్నాల్లో భాగంగా టాక్సిక్ లాంటి ప్రాజెక్టులపై ఆసక్తి పెరుగుతోంది. క్యారెక్టర్ల మధ్య కనెక్షన్స్, స్పిన్-ఆఫ్స్, క్రాస్ ఓవర్స్ లాంటి అంశాలు ఫ్యూచర్ లో సాధ్యమవుతాయనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. పుష్ప సిరీస్ కూడా ఈ భాగంతో ముగుస్తుందా? లేక కొత్త క్యారెక్టర్లతో విస్తరించి యూనివర్స్‌గా మారుతుందా? అన్నది ప్రశ్నగా మారింది. గ్లోబల్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని కథా విస్తరణ, పాత్రల డెప్త్, వరుస సీక్వెల్స్ లాంటి వ్యూహాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, పాన్ ఇండియా ఫ్రాంచైజ్ రేస్, భారీ బాక్సాఫీస్ అంచనాలు, యూనివర్స్ కాన్సెప్ట్ అన్నీ కలిపి ఈ సినిమాలపై ఉన్న ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. మరి రిలీజ్ తర్వాత ఈ ఫ్రాంచైజ్ సినిమాలు ఎలాంటి సంచలనాలను సృష్టిస్తాయో చూడాలి.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com